

అభినవ నీరోలా ఉక్కు సీఎండీ తీరు!
- ప్రస్తుతం పీకల్లోతు కష్టాల్లో స్టీల్‌ప్లాంటు
- ఉత్పత్తికి సరకులు లేవు...19వ తేదీ వచ్చినా జీతాలు లేవు...
- అదేమీ పట్టని ఉన్నతాధికారి...వేదికలపై డ్యాన్సులు

శిశువుల విక్రయ ముఠా అరెస్టు
- ఆరుగురు చిన్నారులను రక్షించిన పోలీసులు
- సీపీ శంఖబ్రతబాగ్చి

వార్తలు II పేజీలో

ఆశల దీపాలు ఆరిపోయాయి

ఆదివాసీ పిల్లల ప్రాణాల మీదకు తెచ్చిన పాస్టర్ నిర్లక్ష్యం

చింతపల్లి, ఆగస్టు 19:



పాస్టర్ కిరణ్‌కుమార్

ఉచితంగా భోజనం పెట్టడంతోపాటు వసతి కల్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతానని ఓ పాస్టర్ చెప్పిన మాటలను వారు విశ్వసించారు. చదువుకుంటే కనీసం పిల్లల జీవితాలైనా బాగుంటాయని ఆశపడ్డారు. అభంశుభం తెలియని తమ బిడ్డలను పాస్టర్ వెంట పంపించారు. అయితే ఆ పాస్టర్ నిర్లక్ష్యం పిల్లల ప్రాణాల మీదకు తెచ్చింది. అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం ఘటన పూర్వపరాలు ఇలా ఉన్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివాసీలు పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. రెక్కాడితేనే గానీ డొక్కాడని పరిస్థితి. కుటుంబంలో పిల్లల సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. కుటుంబ సభ్యులందరికీ ఆహారం అందించడం కష్టమే. గతంలో ఆదివాసీ పిల్లలు విద్యకు దూరంగా ఉండేవారు. కొంత కాలంగా తమ పిల్లలు చదువుకోవాలని ఆదివాసీలు ఆశిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి చదివిస్తున్నారు. ఇటువంటి తరుణంలో పొరుగునున్న అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామానికి చెందిన పాస్టర్ కిరణ్‌కుమార్ తాను అనాథాశ్రమం పెట్టానని, ఉచితంగా చదువు చెప్పిస్తానని, భోజన, వసతితోపాటు దుస్తులు, ఇతర అవసరాలన్నీ తానే చూసుకుంటానని చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దాంతో మంచి విద్యతోపాటు ప్రతిరోజు మంచి భోజనం అందుతుందని పిల్లలను అతని వెంట పంపించారు.

ఏ లోటూ ఉండదనుకున్న ఆదివాసీలు..

గిరిజన ప్రాంతంలో 40 శాతం మంది ఆదివాసీలు క్రైస్తవ మతం స్వీకరించారు. దాంతో పాస్టర్ కిరణ్‌కుమార్ చెప్పిన మాటలను సులభంగా నమ్మేశారు. పాస్టర్ ఆశ్రమంలో చేర్చుకున్న విద్యార్థులందరూ క్రైస్తవులే. ఆశ్రమాన్ని ... మిగతా 6వ పేజీలో

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని ఓ అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి

- పదుల సంఖ్యలో అస్వస్థత
- బాధితులను ఆస్పత్రికి తరలించకుండా ఇళ్లకు పంపేసిన నిర్వాహకుడు
- నర్సీపట్నం, కొయ్యూరు, విశాఖ కేజీహెచ్‌లలో చికిత్స
- కొందరి పరిస్థితి విషమం



మృతిచెందిన గెమ్మెలి భవానీ (ఫైల్ ఫొటో)



మృతి చెందిన కొర్ర సాధ



మృతి చెందిన జాషువా



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలలు

అనకాపల్లి/కోటవురట్ల/నర్సీపట్నం, ఆగస్టు 19: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ అనాథాశ్రమ నిర్వాహకుడి నిర్లక్ష్యం ముగ్గురు విద్యార్థులను బలిగొంది. మరో 42 మంది అస్వస్థతకు గురయ్యేలా చేసింది. బాధిత విద్యార్థులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, కొయ్యూరు మండలం డౌనూరు, రాజేంద్రపాలెం ఆరోగ్య కేంద్రాలు, విశాఖపట్నం కేజీహెచ్‌లలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఆస్పత్రుల్లో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు విచార వదనంతో పడిగాపులు కాస్తున్నారు.

సకాలంలో వైద్యం అంది ఉంటే..

కలుషిత ఆహారం తిని శనివారం అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే ఆస్పత్రిలో చేర్పించి ఉంటే ముగ్గురు చనిపోయే పరిస్థితి ఉండేది కాదని ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. పిల్లలకు ఆరోగ్యం బాగా లేదని తల్లిదండ్రులకు ఫోన్లు చేసి గిరిజన గ్రామాలకు నిర్వాహకుడు పంపించేశాడని, ఇంటికి ... మిగతా 6వ పేజీలో

ఇలా జరుగుతుందని ఊహించలేదు...

- బాగా చదివిస్తారన్న ఉద్దేశంతోనే ఆశ్రమంలో చేర్పించాం
- అస్వస్థతకు గురైతే ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా ఇంటికి పంపేయడం దారుణం
- చిన్నారులు కడుపునొప్పితో విలవిల్లాడారు
- కైలాసపట్నం ఘటనలో బాధితులైన చిన్నారుల తల్లిదండ్రుల ఆవేదన

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):

"మంచిగా చదువుకుంటే పిల్లలు జీవితాలు బాగుంటాయని భావించాం. ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. ఆదివారం ఉదయం ఆశ్రమం నుంచి ఫోన్ చేసి పిల్లలకు బాలేదు. అర్జంటుగా వచ్చి తీసుకువెళ్లమన్నారు. ఏం జరిగిందో కూడా తెలియదు"... అంటూ కైలాసపట్నం ఘటనలో బాధితులైన చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.



కేజీహెచ్‌లో బాధితులైన చిన్నారులతో తల్లిదండ్రులు

అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తీసుకోవడంతో అస్వస్థతకు గురైన 14 మంది పిల్లలను సోమవారం కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడగా కన్నీటి పర్యంతమవుతూ బాధను వెళ్లబోసుకున్నారు. తమ బిడ్డల జీవితాలు బాగుంటాయని పంపించామని, ఇలా ఆస్పత్రి పాలవుతారని ఊహించలేదంటూ వాపోయారు. సుశాంత్ అనే బాలుడి తల్లి గుణమ్మ మాట్లాడుతూ రెండేళ్ల కిందట బాబును ఆశ్రమంలో చేర్పించానని, ఏడాదిలో రెండుసార్లు ఇంటికి వస్తాడన్నారు. ఆదివారం ఉదయం ఫోన్ చేసి ఆరోగ్యం బాలేదని, అర్జెంటుగా తీసుకువెళ్లమన్నారన్నారు. వాంతులు, విరేచనాలు చేసుకుంటూ బాబు విలవిల్లాడాడని, ఏం జరుగుతుందో తెలియక ఆందోళన చెందినట్టు వివరించారు. మరో విద్యార్థి నవీన్ తల్లి మాట్లాడుతూ శనివారం రాత్రి బిర్యానీ తిన్న కొద్దిసేపటి నుంచే విరేచనాలు, వాంతులు అయినట్టు బాబు చెప్పాడన్నారు. ఆశ్రమం నుంచి బాబుకు బాగాలేదని చెబితే హుటాహుటిన వెళ్లామని, వాంతులు ఎక్కువ అవుతుండడంతో చింతపల్లి, నర్సీపట్నం ఆస్పత్రులకు తీసుకువెళ్లి... అక్కడి నుంచి కేజీహెచ్‌కు తీసుకువచ్చినట్టు తెలిపారు. మరో చిన్నారి మీరా తండ్రి పి.సుబ్బారావు మాట్లాడుతూ ఆశ్రమంలో ఉచితంగా భోజనం, వసతి సదుపాయం కల్పిస్తున్నామని చెబితే పాపను ... మిగతా 6వ పేజీలో

అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనే..

ఏటీఎం కేంద్రాల్లో దోపిడీలపై పోలీసుల అంచనా

- రెండు రోజుల కిందట మునగపాకలో...
- తాజాగా పెందుర్తి, తగరపువలసల్లో...
- గ్యాస్‌కట్టర్లతో యంత్రాలను కట్ చేస్తున్న దుండగులు
- సీసీ కెమెరాల్లో ఫుటేజీ లేకుండా డీవీఆర్ ఎత్తుకుపోతున్న వైనం
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఏటీఎం కేంద్రాల్లో మళ్లీ చోరీలు జరుగుతున్నాయి. దొంగలు కారులో వచ్చి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్ చేసి అందులోని నగదును దోచుకుపోతున్నారు. తమ ఆనవాళ్లు పోలీసులకు తెలియకుండా బయట ఉండే సీసీ కెమెరాలకు నల్లటి రంగు స్ప్రే చేస్తున్నారు. ఆ తర్వాత లోపలకు ప్రవేశిస్తున్నారు.



గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన తగరపువలస అవంతి కళాశాల సమీపంలోని ఏటీఎం కేంద్రం

ఏటీఎం కేంద్రాలు అందుబాటులోకి వచ్చిన కొత్తలో దుండగులు వాటిల్లో చోరీలకు పాల్పడేవారు. గునపాలు, రాడ్లు ఉపయోగించి ఏటీఎం యంత్రాలను తెరిచేవారు. పోలీసులు గట్టిగా దృష్టి పెట్టి నిందితులను అరెస్టు చేశారు. మరోవైపు బ్యాంకులు కూడా ఏటీఎంల వద్ద భద్రతాపరమైన లోపాలు సరిదిద్దుకున్నాయి. ప్రతి ఏటీఎం కేంద్రం వద్ద సెక్యూరిటీ గార్డును నియమించడంతోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి సంబంధిత బ్యాంకుల కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసుకున్నాయి. దీని వల్ల ఏటీఎం కేంద్రం లోపల, పరిసరాల్లో జనాల కదలికలను కూడా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షించేవారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీపంలోని తమ సిబ్బందిని అక్కడకు పంపించేశారు. వీటన్నింటి కారణంగా ఏటీఎం కేంద్రాల్లో చోరీలకు అడ్డుకట్టపడింది. తాజాగా మళ్లీ ఏటీఎం కేంద్రాల్లో దోపిడీలు మొదలయ్యాయి. ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి సమయంలో అనకాపల్లి జిల్లా మునగపాకలో ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో దొంగలు చొరబడి రూ.14.4 లక్షలు ఎత్తుకుపోయారు. 17న అర్ధరాత్రి దాటిన తర్వాత పెందుర్తి శివారులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో చొరబడి రూ.19 లక్షలతో పరారైపోయారు. అదేరోజు రాత్రి తగరపువలస శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో రూ.14.4 లక్షలను అపహరించుకుపోయారు. అన్నిచోట్ల చోరీలు ఒకే తరహాలో ఉండడంతో ఒకే గ్యాంగ్ పని అయివుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులు కారులో వచ్చి ఏటీఎం కేంద్రం వద్ద ఆగి, బయట ఉండే సీసీ కెమెరాలకు నల్లటి రంగును స్ప్రే చేస్తున్నారు. దీని వల్ల వారి ఆనవాళ్లు సీసీ కెమెరాల్లో రికార్డు కావడం లేదు. అనంతరం లోపలకు వెళ్లి సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి, గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎం యంత్రాన్ని ముక్కలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దుండగులు తమ ఆనవాళ్లు పోలీసులకు లభ్యం కాకుండా ఉండేందుకు ముఖానికి మాస్కులతోపాటు చేతికి గ్లౌజ్‌లు ధరిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీని నిల్వ చేసే హార్డ్ డిస్క్ ఉండే డీవీఆర్‌లను కూడా తమ వెంట తీసుకుపోతున్నారు. దీనివల్ల వారి చేతివేలి ముద్రలు కూడా లభ్యం కావడం లేదని పోలీసులు చెబుతున్నారు. ఈ తరహా నేరాలకు ... మిగతా 6వ పేజీలో

భూ కుంభకోణాలపై దృష్టి

ప్రధానంగా దసపల్లా, హయగ్రీవ, రామానాయుడు స్టూడియో భూములు, 22-ఎ నుంచి మినహాయింపులపై లోతుగా అధ్యయనం

- ఫ్రీ హోల్డ్ సర్టిఫికెట్ల జారీపై కూడా...
- శారదా పీఠానికి కేటాయించిన భూములు వెనక్కి తీసుకునే యోచన
- వివాదాలపై న్యాయ నిపుణులతో సంప్రతింపులు



శారదా పీఠానికి కేటాయించిన భూములను పరిశీలిస్తున్న సిసోడియా (ఫైల్)

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖలో జరిగిన భూ కుంభకోణాలపై లోతుగా అధ్యయనం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రధానంగా దసపల్లా, హయగ్రీవ ఇన్‌ఫ్రా, రామానాయుడు స్టూడియో భూములు, భీమిలిలో శారదా పీఠానికి కేటాయింపులు, ఇంకా డీపట్టాలకు ఫ్రీహోల్డ్ అనుమతులు, పలు కేటగిరీల భూములను 22-ఎ నుంచి తప్పించడం, ప్రజలను బెదిరించి భూములు కాజేయడం వంటి అంశాలపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ఈ విషయంలో ఎటువంటి వివాదాలు తలెత్తకుం డా ముందుగానే న్యాయ నిపుణులతో సంప్రతింపులు జరుపు తోంది. జిల్లా స్థాయిలో ప్రభుత్వ ప్లీడర్లు, రాష్ట్రస్థాయిలో హైకోర్టులో ప్రభుత్వ జీపీలు, స్టాండింగ్ కౌన్సిళ్లతో చర్చించనున్నారు.

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా మూడు రోజుల క్రితం విశాఖలో పర్యటించారు. ఈ సందర్భంగా వివాదాస్పద భూముల వ్యవహారాలను ఆయన దృష్టికి జిల్లా అధికారులు తీసుకువెళ్లారు. ఇంకా తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో కూడా భూములపై చర్చ జరిగింది. సిసోడియా పర్యటన ముగించుకుని అమరావతి వెళుతూ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారని తెలిసింది. కొన్ని ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించినందున వాటిపై ముందుకువెళ్లాలంటే తొలుత కోర్టుల్లో ఉన్న కేసులు అధ్యయనం చేయాలని అన్నట్టు తెలిసింది. దసపల్లా భూములకు గ్రౌండ్ రెంట్ పట్టా ఇవ్వకూడదని సిసోడియా అభిప్రాయపడడాన్ని ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు కొందరు గుర్తుచేస్తున్నారు. ఆ భూములకు సంబంధించి టౌన్ సర్వే రిజిస్టర్‌లో రాణి ఆఫ్ వాడ్వాన్ పేరు ఉన్నప్పటికీ...ఆమెకు ఆ భూములు ఎలా వచ్చాయి?, ఆమె నుంచి దసపల్లా రాణి కమలాదేవికి ఎలా దఖలు పడ్డాయి?, ఆమె నుంచి ఎవరి చేతుల్లోకి, ఎలా వెళ్లాయి?...అనే వివరాలకు సంబంధించి లింకు డాక్యుమెంట్లు లేవు. దాంతో కొనుగోలుదారుల పేర్లు టౌన్ సర్వే రికార్డుల్లో ఇన్ కార్పొరేట్ చేయడానికి జీవీఎంసీ అధికారులు తిరస్కరించారు. దీనికి సంబంధించి ఒరిజినల్ గ్రౌండ్ రెంట్ పట్టా కూడా లేదని కొందరు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో దసపల్లా భూములపై న్యాయ నిపుణులతో చర్చించాలని ... మిగతా 6వ పేజీలో

ఏయూలో విచారణ

- వివిధ విభాగాల్లో తీసుకున్న నిర్ణయాలపై అధ్యయనానికి కమిటీల నియామకం
- ఇక్కడి వారితోపాటు ఇతర వర్సిటీల ప్రొఫెసర్లు సభ్యులుగా నియామకం



విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు విభాగాల్లో గతంలో తీసుకున్న నిర్ణయాలు, ఆమోదం, అమలుపై విచారణకు అధికారులు ఆరు కమిటీలను నియమించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు ఈ కమిటీలను నియమించారు. ఏయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ స్టడీస్, రూసా ఫేజ్-2, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏయూ టీడీఆర్ హబ్‌లపై పూర్తిస్థాయిలో విచారణకు కమిటీలను నియమించారు. కమిటీ సభ్యులుగా ఏయూ ప్రొఫెసర్లతోపాటు ఇతర విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, నిపుణులను నియమించారు. వీరు అన్ని అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి నివేదికను అందించనున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ, పనులు, కాంట్రాక్టుల మంజూరు వంటివి జరిగినా, నిధుల దుర్వినియోగం జరిగినా ఆధారాలతో నివేదికలో పొందుపరచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సదరం కట్టుదిట్టం

- అర్హులకు మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేయాలని అధికారులకు అందిన ఆదేశాలు
- నగర పరిధిలో బోధనాస్పత్రులైన కేజీహెచ్, ఈఎన్‌టీ, కంటి, మానసిక ఆస్పత్రిల్లో జారీ
- గ్రామీణ జిల్లాలో 20కుపైగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లోనూ అవకాశం
- కొన్ని జిల్లాల్లో అనర్హులకు పత్రాలను జారీచేసిన నేపథ్యంలో అప్రమత్తమైన ప్రభుత్వం
- సర్టిఫికెట్లు మంజూరుచేయిస్తామంటూ డబ్బులు వసూలు చేస్తున్న దళారులు
- కొన్నిచోట్ల వైద్యుల పాత్ర

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):

'సదరం' సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. ఈ సర్టిఫికెట్లను రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో గతంలో అడ్డగోలుగా జారీచేశారు. పొరుగు జిల్లాలోని ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన వైద్యుడు...సదరం సర్టిఫికెట్లను ఇష్టానుసారంగా జారీచేశారని ఫిర్యాదులు రావడంతో అధికారులు ప్రస్తుతం విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో మరింత పారదర్శకంగా, కట్టుదిట్టంగా సదరం సర్టిఫికెట్లను జారీ చేయాలని జిల్లాలకు ఆదేశాలు అందినట్టు అధికారులు చెబుతున్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం మంజూరుచేసే పింఛన్ కోసం తప్పనిసరిగా 'సదరం' సర్టిఫికెట్ కలిగివుండాలి. అయితే కొంతమంది అర్హత లేకపోయినా పింఛన్ కోసం అడ్డదారుల్లో సర్టిఫికెట్లు తీసుకుంటున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. చాలా ఆస్పత్రుల్లో దళారులు రెండు, మూడు నెలల పెన్షన్ డబ్బును ముందుగా చెల్లిస్తే (అంటే రూ.10 వేల నుంచి రూ.12 వేలు) సదరం సర్టిఫికెట్ చేయిస్తామని ఆశావహుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. వైద్యులను సదరు దళారులు మేనేజ్ చేసి సర్టిఫికెట్లు జారీ చేయిస్తున్నట్టు చెబుతున్నారు. వైద్యులతో చేయించలేని పక్షంలో డూప్లికేట్ పత్రాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరం సర్టిఫికెట్లు జారీచేసే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, దరఖాస్తు దారుడిని క్షుణ్ణంగా ... మిగతా 6వ పేజీలో

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం



విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్

రామ్‌నగర్, ఆగస్టు 19: బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో వైజాగ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ రెండు రోజులపాటు జరుగుతుందన్నారు. ప్రదర్శనలో 300లకు పైగా ఫొటోలను ఉంచారని, నగరవాసులు వాటిని తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ మూర్తి, కార్యదర్శి జి. తిరుపతిరావుపాల్గొన్నారు.

ముగిసిన చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ



విజేతలతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 19: ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడలిస్టు చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ముగిసింది. ఎంవీపీ కాలనీ వద్దనున్న ఎస్-3 స్పోర్ట్సు ఎరీనాలో జరిగిన ఈ టోర్నీలో నగర పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది చిన్నారులు పాల్గొన్నారు. బాల, బాలికల విభాగాల్లో తొలి ఐదు స్థానాలలో విజేతలుగా నిలిచిన చిన్నారులను జోనల్ స్థాయి టోర్నీకి ఎంపిక చేసినట్టు ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు బాబూరావు తెలిపారు. ఈ టోర్నీలో ఎస్-3 స్పోర్ట్సు ఎరీనా డైరెక్టర్ సహాని ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. చెస్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో బుల్లయ్య క్రీడాకారులకు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న మధుకుమార్, కోచ్‌లు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 19: జిల్లా జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థులు పతకాలు సాధించారు. నగరంలో జరిగిన ఈ టోర్నీ మహిళల విభాగంలో ఎస్. హేమ, బి. తేజశ్రీ స్వర్ణ పతకాలు, జి. పూజిత, కె. భాగ్యశ్రీ రజత పతకాలు, కె. జ్ఞాపికరెడ్డి, జి.అనూష కాంస్య పతకాలు సాధించారు. కాగా, పురుషుల విభాగంలో బి. రామ్‌చరణ్ తేజ, ఎస్. శ్యామ్‌కుమార్, సీహెచ్. లోకేశ్ సర్ణ పతకాలు కైవసం చేసుకోగా, ఏఎంబీఎస్ఎస్ గణేష్, పి. భార్గవ్, బీపీఎంకే యాదవ్ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవరం కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్ తన కార్యాలయంలో ఈ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్. లక్ష్మణరెడ్డి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు అభినందనలు



విష్ణుకుమార్‌రాజుకు పుష్పగుచ్ఛమిస్తున్న టీడీపీ నాయకులు

మురళీనగర్, ఆగస్టు 19 ; ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు సోమవారం టీడీపీ 50వవార్డు అధ్యక్షుడు సనపల.వరప్రసాద్, నాయకులు కె.వెంకటేష్ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యేని కలసి పుష్పగుచ్ఛాలు, శాలువతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించి ప్రజలకు చేరువలో ఉండాలని ఆకాంక్షించారు. ఏసీఏ తరఫున పలుటోర్నమెంట్స్ నిర్వహణతో క్రీడాకారులకు చేయూతనివ్వాలని ఈ సందర్భంగా వరప్రసాద్ కోరారు.

వెలగని ఇండికేషన్ లైట్స్‌తో ట్రాఫిక్ కష్టాలు

- డాబాగార్డెన్స్ సర్కిల్ వద్ద సమస్య
- ఇష్టానుసారంగా రాకపోకలు
- ప్రమాదాల బారిన వాహనదారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 19: డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ నగరంలో ప్రధాన జంక్షన్. నిత్యం వేలాది వాహనాలు నలువైపులనుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. వివిధ వాణిజ్య సముదాయాలు, ఆర్టీసీ కాంప్లెక్స్, కాలేజీలు, కార్యాలయాలుఉండడంతోపాటు వన్‌టౌన్‌రోడ్డుకు ఈ మార్గాన్నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో ఎప్పుడూ ఈ జంక్షన్ రద్దీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ఇండికేషన్ లైట్స్ ఎంతో కీలకం. కానీ, కొన్నిరోజులుగా ఇవి పనిచేయకపోవడంతో సర్కిల్ వద్ద రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టూ తిరిగే సమయంలో ఒక్కోసారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సంఘటనలున్నాయి. రాత్రి వేళలో ఈసమస్య మరింత జఠిలంగా మారుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు ఇండికేషన్ లైట్స్ పనిచేసేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



అంబేడ్కర్ జంక్షన్‌లో పనిచేయని ట్రాఫిక్ ఇండిగేషన్ లైట్స్



ఎల్ఐసీ కూడలివైపు వెళ్లే మార్గంలో..

మహిళా న్యాయవాదుల అభ్యున్నతికి కృషి



సంఘీభావం తెలుపుతున్న మహిళా న్యాయవాదులు

సీతంపేట, ఆగస్టు 19: మహిళా న్యాయవాదుల అభ్యున్నతికి, సమాజంలో అసమానతలను, వివక్ష రూపుమాపేందుకు కృషి చేస్తామని వుమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనురాధ పప్పు, కార్యదర్శి పి.హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా న్యాయవాదుల ఔన్నత్యాన్ని పెంపొందించేలా వారికి సహాయ సహకారాలందించాలనే ఉద్దేశంతో వుమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించినట్టు చెప్పారు. మహిళా న్యాయవాదులు పనిచేస్తున్న ప్రదేశం వద్ద భద్రత, వ్యక్తిత్వ వికాసం కోసం పనిచేస్తామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మహిళా హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కోల్‌కత్తాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచారాన్ని ఖండిస్తూ మంగళవారం ఉదయం కోర్టు వద్ద నుంచి ర్యాలీని నిర్వహిస్తామన్నారు. ఈ నెల 31న సిరిపురంలోని వీఆర్ఎండీ చిల్డ్రన్ ఎరినా హాలులో మహిళా న్యాయవాదులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో హైకోర్టు, జిల్లా కోర్టు జడ్జిలు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మి నాగశ్రీ దుర్గా, కోశాధికారి పి.రమాదేవి, జాయింట్ సెక్రటరీ పి.లీలావతి, కె.ఎస్. కళావతి, ఎస్.హేమలత, డి.కనకదుర్గా, డి.సుకన్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత నడవడికపై పర్యవేక్షణ తప్పనిసరి

- ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి



మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి

డాబాగార్డెన్స్, ఆగస్టు 19: యువత నడవడికపై నిరంతరం తల్లిదండ్రులు పర్యవేక్షించాల్సిన అవసరం కచ్చితంగా ఉందని ఏసీపి అన్నెపు నర్సింహమూర్తి సూచించారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం 'మాదక ద్రవ్యాల వినియోగ విషసంస్కృతి- ప్రమాదంలో యువత భవిష్యత్తు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం ద్వారా మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దీంతో యువత చెడుమార్గంలో మరలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ దుష్ఫలితాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. డాక్టర్ ఎస్.ఎస్.రాజు, డా.వి.ఎస్. కృష్ణ కాలేజీ ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధంపై తగు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ప్రజలు ఇందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊర్వశి జంక్షన్‌లో గంటన్నరపాటు నిలిచిన ట్రాఫిక్

- సమస్య పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు

కంచరపాలెం, ఆగస్టు 19 : కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు సోమవారం రాత్రి ట్రాఫిక్ గంటన్నరపాటు నిలిచిపోయింది. ఈ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జంక్షన్‌లో చిన్నగా ఉన్న రోడ్డు దీనితో పాటు మధ్యలో ఎక్కడిపడితే అక్కడ డివైడర్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమవుతోంది. మెట్టు, ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా వాటిని పర్యవేక్షించడానికి సిబ్బందిని సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో సమస్య యథాతథమవుతోంది. సోమవారం రాత్రి గంటల తరబడి రోడ్డు మధ్యలో వాహనాలు చిక్కుకుపోయి ఎటూ వెళ్లలేని స్థితిలో ఉండిపోవడంతో వాహనదారులు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సమస్యపై మాత్రం ట్రాఫిక్ పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంపట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఈ మార్గంలో ప్రత్యేక ట్రాఫిక్ బీట్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



ఊర్వశి జంక్షన్ వద్ద నిలిచిన వాహనాలు

సముద్ర తీర ప్రాంతం కబ్జా

కలెక్టర్‌కు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఫిర్యాదు

మహారాణిపేట, ఆగస్టు 19: కోస్తా జిల్లాల పరిధిలోని సముద్ర తీర ప్రాంతంలో పెద్దఎత్తున సీఆర్‌జెడ్ నిబంధనలుఉల్లంఘించి 73 కిలోమీటర్ల మేర ఆక్రమించారని, వీటిని తొలగించాలని జనసేన కార్పొరేటర్ పి. మూర్తియాదవ్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల వేదికలో ఆయన వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమిలి బీచ్ రోడ్డులో పెద్దఎత్తున సీఆర్‌జెడ్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, కొందరు అధికారులే కబ్జాలకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇసుక తిన్నెల్లో కట్టడాలను యథేచ్ఛగా సాగిస్తున్నారన్నారు. సాగర తీరాన్ని ఆక్రమణలనుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మత్స్యకారులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలన్నారు.

రాఖీ వేడుకలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరికి రాఖీ కడుతున్న దృశ్యం

రామ్‌నగర్, ఆగస్టు 19: విశాఖ పర్యటనలో ఉన్న సుప్రీం కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి సోమవారం కుటుంబ సభ్యులతో కలసి రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భీమిలిలోని హోటల్ నోవాటెల్ లోసందడిగా గడిపారు. తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఇలా జరుగుతుందని ఊహించలేదు...

... 5వ పేజీ తరువాయి

చేర్పించామన్నారు. అక్కడ బాగా చదువుకుంటుందని ఆశపడ్డామన్నారు. ఆశ్రమ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దారుణం సంభవించిందన్నారు. పిల్లలకు వాంతులు, విరేచనాలు అయితే ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా..తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి పంపించేశారన్నారు. మరో చిన్నారి గీత తండ్రి బాబూరావు మాట్లాడుతూ శనివారం రాత్రి నుంచే పాపకు వాంతులు అవుతున్నాయని, కానీ, తీరిగ్గా ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం ఫోన్ చేశారన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే పాపను ఆశ్రమంలో చేర్పించామని, ఇలా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదని వాపోయారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనే

... 5వ పేజీ తరువాయి

బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు చెందిన అంతర్రాష్ట్ర ముఠాలు పాల్పడుతుంటాయని పోలీసులు చెబుతున్నారు. ఎంతోకాలంగా ఆగిపోయిన చోరీలు తిరిగి మొదలుకావడంతో పోలీసులు సీరియస్‌గా దృష్టిసారించారు. చోరీలకు పాల్పడిన నిందితులు కారులో వచ్చినట్టు ఆచూకీ లభించడంతో ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకోవడం ద్వారా ఏటీఎం చోరీలకు అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నారు.

సకాలంలో ధ్రువపత్రాలు జారీ

సీతమ్మధార, ఆగస్టు 19: విద్యార్థుల చదువుకు అవసరమైన కుల, నివాస, ఆదాయ తదితర ధ్రువపత్రాలను సకాలంలో జారీ చేసేలా చర్యలు చేపడుతున్నట్టు తహసీల్దార్ ఎం.రమేష్ పేర్కొన్నారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాద్, ఆర్ఐ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

... 5వ పేజీ తరువాయి

వెళ్లిన తరువాత విద్యార్థుల పరిస్థితి మరింత విషమించిందని చెబుతున్నారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు ఉండరని, ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే డబ్బులు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుందని సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య చేయిద్దామని అనుకున్నామని చింతపల్లి మండలం పొలంబంద గ్రామానికి చెందిన మర్రి చందు తెలిపారు. హాస్టల్‌లో ఉంచితే చదువు బాగా చెబుతారని తెలిసినవారు చెబితే తన ఇద్దరు పిల్లలు ప్రశాంత్, రంజిత్‌లను చేర్పించామని చెప్పారు. సోమవారం తన ఇద్దరు పిల్లల పరిస్థితి బాగాలేకపోతే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చామని తెలిపారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో..

అస్వస్థతకు గురైన 34 మంది విద్యార్థులు ప్రాంతీయ ఆస్పత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందారు. వీరిలో కొంత మందిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, ప్రజా సంఘాల నాయకులతో ఏరియా ఆస్పత్రి నిండి పోయింది. సోమవారం మధ్యాహ్నానికి 16 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, ఇక్కడ వైద్యులు హుటాహుటిన అత్యవసర వైద్య సేవలు అందించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించారు. తరువాత కొయ్యూరు మండలం డౌనూరు నుంచి మరో 18 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకు రాగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కి తరలించారు. మిగిలిన వారికి ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎస్పీ దీపిక, ఆర్డీవో జయరాం, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు ఏరియా ఆస్పత్రిని సందర్శించి గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, వైద్యులను ఆరా తీశారు.

ఆస్పత్రిలో పరుగులు పెట్టిన డాక్టర్లు

ఏరియా ఆస్పత్రిలో తీవ్ర అస్వస్థతతో చేరిన చిన్నారుల ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో వైద్యులు పరుగులు పెట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, చిన్ని పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, మిగిలిన వైద్యులు, వైద్య సిబ్బంది వేగవంతమైన సేవలు అందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం 34 మంది విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలు అందించారు. వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు.. ఏరియా ఆస్పత్రి వైద్యులు అందించి వేగవంతమైన వైద్య సేవలను ప్రశంసించారు.

భూ కుంభకోణాలపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

భావిస్తున్నారు. అలాగే వృద్ధులకు ఆశ్రమం నిర్మిస్తామని చెప్పి ఎండాడలో హయగ్రీవ సంస్థ తీసుకున్న భూములను రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా పరిశీలించారు. ప్రాజెక్టులో పేర్కొన్న నిబంధనల మేరకు తొలుత వృద్ధాశ్రమం నిర్మించాలి. కానీ అక్కడ విల్లాలు నిర్మిస్తున్నారు. దీనికితోడు ఒరిజినల్ డెవలపర్ జగదీశ్వరుడికి బదులు ఆయన జీపీగా ఉన్న ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు పనులు చేపడుతున్నారు. పనులు నిలిపివేయాలని జీవీఎంసీ ఇచ్చిన ఆదేశాలపై జీవీ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. దీనిపై ఇంతవరకూ ప్రభుత్వం కౌంటర్ వేయలేదు. దీనిపై త్వరలో ప్రభుత్వం అఫిడవిట్ వేయాలని నిర్ణయించినట్టు సిసోడియా పేర్కొన్నారు. అదేవిధంగా రామానాయుడు స్టూడియోకు ఇచ్చిన భూమిలో అనుమతులు లేకుండా లేఅవుట్ అభివృద్ధి చేస్తున్న విషయం ఆ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఇంకా నగర శివారుల్లో మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, పొలిటికల్ సఫరర్లకు ప్రభుత్వం ఇచ్చిన భూములు చేతులు మారినట్టు ఫిర్యాదులు రావడంతో 2016 తరువాత వాటిని 22-ఎలో చేర్చారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్నత స్థాయి ఒత్తిళ్ల మేరకు అందులో కొన్నింటికి మినహాయింపు ఇచ్చారు. అదేవిధంగా శారదా పీఠానికి భీమిలి మండలం కొత్తవలసలో ఎకరా కేవలం రూ.లక్షకు కేటాయించారు. పీఠానికి ఇచ్చిన భూములు వెనక్కి తీసుకోవాలంటే ఏ విధంగా ముందుకెళ్లాలి? అన్నదానిపై ఆలోచన చేస్తున్నారు. ఇక, వైసీపీ నేతలు కొందరు నగరం, పరిసరాల్లో పలువురిని బెదిరించి కోట్ల రూపాయల విలువైన భూములను బలవంతంగా తీసుకున్నారు. ఈ విషయమై ఈపీడీసీఎల్ మాజీ ఉన్నతాధికారి సతీమణి స్వయంగా సిసోడియాకు ఫిర్యాదు చేశారు. అటువంటి వ్యవహారాల్లో ఎలా ముందుకువెళ్లాలి? అనేది ఆలోచన చేస్తున్నారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీపై కూడా న్యాయ నిపుణులతో చర్చించి ముందుకువెళ్లాలని యోచిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో న్యాయ నిపుణులతో చర్చించిన మీదట వివాదాస్పదమైన భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నది.

సదరం కట్టుదిట్టం

... 5వ పేజీ తరువాయి

పరిశీలించిన తరువాత అర్హత ప్రామాణికంగా పాయింట్లు కేటాయించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు అందాయి.

భారీగా దరఖాస్తుదారులు

సామాజిక పింఛన్ పొందేందుకు సదరం సర్టిఫికెట్ అవసరం కావడంతో భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని కేజీహెచ్, ఈఎన్‌టీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, మానసిక ఆస్పత్రితోపాటు మరో 20కిపైగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో సదరం సర్టిఫికెట్లు జారీచేస్తున్నారు. ఆర్థో, న్యూరో సంబంధిత సమస్యలు కలగినవారికి కేజీహెచ్‌లో, కంటి సంబంధిత సమస్యలు కలిగిన వారికి ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో, మానసిక సమస్యలతో బాధపడే వారికి మానసిక ఆస్పత్రిలో, వినికిడి, మూగ సంబంధిత సమస్యలు కలిగిన వారికి ఈఎన్‌టీ ఆస్పత్రి కేటాయిస్తున్నారు. బోధనాస్పత్రుల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో, మిగిలిన ఆస్పత్రుల్లో ప్రతి బుధ, గురువారాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన వారికి మెడికల్ ఎగ్జామినేషన్ (బోర్డు అసెస్‌మెంట్) జరుగుతుంది. కేజీహెచ్‌కు ఆయా రోజుల్లో కనీసం 50 మంది, మిగిలిన బోధనాస్పత్రులకు 20 మందివరకు వస్తుంటారు. అలాగే, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు కనీసం పది మంది వస్తుంటారు. వీరిని ఆయా ఆస్పత్రుల్లోని వైద్యులు పరిశీలించి సదరం వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తారు. అనంతరం కొద్దిరోజుల తరువాత వారి ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని స్థానిక సచివాలయంలో గానీ, మీ సేవా కేంద్రాల్లోగాని సదరం సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే, వైద్యులను మేనేజ్ చేస్తామంటూ కొందరు దళారులు ఆశావహులు నుంచి భారీగా వసూలు చేస్తున్నారు.

ఎక్కువ చూపించేలా..

సాధారణంగా సదరం సర్టిఫికెట్లకు వచ్చే వారిలో శారీరక వైకల్యం, మూగ, చెవిటి, మానసిక, న్యూరో సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఉంటారు. కొందరు చిన్నపాటి ఇబ్బంది ఉన్నా సదరం సర్టిఫికెట్ వస్తే నెల నెలా ప్రభుత్వం నుంచి సాయం పొందవచ్చునన్న ఆశతో ఉంటారు. వీరి ఆశను ఆసరాగా చేసుకుని చాలామంది వసూళ్లకు పాల్పడుతున్నారు. కొన్నిచోట్ల వైద్యులే ఈ వ్యవహారంలో భాగస్వాములవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆశల దీపాలు ఆరిపోయాయి

... 5వ పేజీ తరువాయి

పాస్టర్ నిర్వహిస్తుండడంతో తమ పిల్లలకు ఏలోటూ ఉండదని ఆదివాసీలు భావించారు. అయితే పాస్టర్ నిర్లక్ష్యంగా ఓ వివాహ విందులో మిగిలిపోయిన బిర్యానీని రాత్రివేళ పిల్లలకు పెట్టడంతో పెనువిషాదం చోటుచేసుకుంది.

ఆస్పత్రిలో చేర్పించి ఉంటే ప్రాణహాని తప్పేది..

అస్వస్థతకు గురైన విద్యార్థులను పాస్టర్ వెంటనే సమీపంలోనున్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించేశారు. నిరక్షరాస్యులైన ఆదివాసీలు పిల్లలను ఆస్పత్రికి తీసుకొని వెళ్లకుండా ఇళ్లకు తీసుకువెళ్లిపోయారు. దాంతో పరిస్థితి విషమించింది.

సోదర భావం, ఆత్మీయ బంధాలకు రాఖీ పౌర్ణమి ప్రతీక

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ

మహారాణిపేట, ఆగస్టు 19: సోదర భావం, ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఆ పార్టీ సౌత్ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ అన్నారు. సోమవారం పార్టీ కార్యలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలుగు మహిళలు గండిబాబ్జీ, సీతంరాజు సుధాకర్‌కు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి భారతీయ సనాతన సంప్రదాయంగా వస్తోందన్నారు. సోదర సోదరీమణులకు అనుబంధాలకు ఈ వేడుకలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు ఈతలపాక సుజాత, కేదారి లక్ష్మి, గనగళ్ళ సత్యవతి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోన్, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్, ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ముందుగా బ్రహ్మకుమారి సభ్యులు రమా, తదితరులు గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధాలకు ఈ వేడుక నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, అహ్మద్ మున్నర్, చాట్ల బాబూరావు రెడ్డి, డాక్టర్ కేవీ ఎస్ఎస్ మూర్తి, హరగోపాల్, రచయిత్రి ఉండవల్లి సుజాతామూర్తి, సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాధవధార; గ్రేటర్ 50వ వార్డు మురళీనగర్ బ్రహ్మకుమారీ శాంతిధామంలో సోమవారం రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు, ప్రముఖులు, కార్పొరేటర్లకు శాంతిధామం ఇన్‌చార్జి బి. కె. అపరంజి ఆధ్వర్యంలో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఏటా ఈ సెంటర్‌లో సోదరభావాన్ని చాటుతూ రక్షాబంధన్ నిర్వహిస్తున్నట్టు బ్రహ్మకుమారీలు తెలిపారు.

అక్కయ్యపాలెం: ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు, వైజాగ్ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్‌కు బ్రహ్మకుమారి శశికళ రాఖీ కట్టారు.



గండిబాబ్జీకి రాఖీ కడుతున్న తెలుగు మహిళలు



ఆచార్య బాలమోహన్‌దాస్‌కి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తొమ్మిది ఫిర్యాదులు

వేపగుంట, ఆగస్టు 19: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 ఫిర్యాదులు అం దాయి. 92వ వార్డు వెంకటాపురంలో చెట్లు తొలగించాలని, చినముషిడివాడ సర్వేనంబరు 110లో ఇచ్చిన తప్పుడు ప్లాన్‌ను రద్దు చేయాలని, 96వ వార్డు మరిడిమాంబగుడి సమీపాన 40 అడుగుల రోడ్డులో ఆక్రమణను అడ్డుకోవాలని కోరారు. 97వ వార్డులో సుజాతానగర్, వెంకటాద్రినగర్‌లలో పారిశుధ్య సమస్యలపై, పులగానిపాలెంలో పబ్లిక్ రోడ్డు ఆక్రమించి చేస్తున్న నిర్మాణాలు అడ్డుకోవాలని తదితర ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత శాఖాధికారులకు పంపించి పరిష్కార చర్యలు తీసుకుంటామని జోన్ అధికారి కె.హేమవతి పేర్కొన్నారు.

వాకింగ్ ట్రాక్ సమస్యలపై వినతి

అగనంపూడి, ఆగస్టు 19: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలోని స్థానిక వాకింగ్ ట్రాక్‌లో నెలకొన్న సమస్యలపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సోమవారం వాకర్స్ క్లబ్ ప్రతినిధులు కలిసి వినతి పత్రం అందజేశారు. నడక మైదానంలో విద్యుత్ దీపాలు ఏర్పా టుతోపాటు సిమెంట్ చప్టాలు నిర్మించాలని కోరారు. మౌలిక వసతిలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మడుగుల నరిసింగరావు, డొక్కా రమేశ్, కరణం పైడిరాజు, పూర్ణ, తదితరులు ఉన్నారు.

'ఆక్రమణలపై చర్యలు తీసుకోండి'



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ నరసింహపాత్రుడు

పెదగంట్యాడ, ఆగస్టు 19: జీవీఎంసీ 65వ వార్డు పరిధి కేఎల్ రావు నగర్ టిడ్కో ఇళ్ల సమీపాన సర్వే నంబరు 64/17,18లో ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోందని కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు సోమవారం కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇక్కడి ప్రభుత్వ స్థలంలో ఆక్రమణదారులు తాత్కాలికంగా షెడ్లు నిర్మించారని, అధికారులు వాటిని తొలగించి, ఆంక్షలు విధించినా ఆగడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామని, రజకుల దోబీఖానా, ఇతర అవసరాలకోసం ఉంచిన స్థలాన్ని కూడా ఆక్రమిస్తున్నారని, దీనిపై విచారణ జరిపి స్థలాలను పరిరక్షించాలని కోరారు. ఆయన వెంట రట్టి వాసు తదితరులున్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

అగనంపూడి, ఆగస్టు 19: పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులంతా కృషిచేయాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. అగనంపూడి ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. ప్రాంగణాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేలా కృషి చేయాలన్నారు. కరణం జగదీశ్, మాడిశ వెంకటరావు, సింగిడి సింహాచలం, గల్లా రుద్రకుమార్, మామిడి అప్పారావు పాల్గొన్నారు.

పెరుగుతున్న దొంగతనాలు

ఆటోనగర్, ఆగస్టు 19: గ్రేటర్ 70వ వార్డు తోకాడ, చిట్టినాయుడుకాలనీ, డ్రైవర్సు కాలనీ, 71వార్డు పరిధిలో దిబ్బపాలెం, సుందరయ్యకాలనీల్లో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంటోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

1 నుంచి ఏఐటీయూసీ సమావేశాలు

గాజువాక, ఆగస్టు 19: స్టీల్‌ప్లాంట్‌లో సెప్టెంబరు ఒకటి నుంచి జరగనున్న సీఐటీయూ జాతీయ సమావేశాల పోస్టర్‌ను సోమవారం చైతన్యనగర్‌లో సీపీఐ నేత ఏజే స్టాలిన్ ఆవిష్కరించారు. సమావేశాల్లో కార్మిక సమస్యలపై చర్చిస్తామన్నారు. కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజుబాబు, ఆనంద్, అచ్యుతరావు, విష్ణు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, సంగం, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **భారతీయుడు-2 :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం 130, బరబాటి 25, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 38, దోసకాయలు 20, వెల్లుల్లి 230, కొబ్బరికాయ 23, బీన్స్ (పెన్సిల్) 62, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 48, కంద 58, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, క్రరపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 98
ఫారం ధర	-- 118
విత్ స్కిన్	-- 206
స్కిన్‌లెస్	-- 216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



86వ వార్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో అలముకున్న చీకట్లు



88వ వార్డులో రహదారి పక్కన వెలగని వీధి దీపాలు

పారిశ్రామిక ప్రాంతంలో అంధకారం

- ఉడానగర్, ఫకీరుతఖ్యా, యాదవ జగ్గరాజు పేట గ్రామాల్లో వెలగని వీధి దీపాలు
- మరమ్మతులకు గురైనా పట్టించుకోని అధికారులు
- నిర్వహణలో సిబ్బంది ఇష్టారాజ్యం
- చీకట్లో అవస్థలు పడుతున్న స్థానికులు

కూర్మన్నపాలెం, ఆగస్టు 19: పారిశ్రామిక ప్రాంతంలోని పలు కాలనీలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జీవీఎంసీ 86వార్డు ఉడానగర్, ఫకీరుతఖ్యా, రాజీవ్‌నగర్, రాసాలమ్మకాలనీ, 88వ వార్డు కాపు, యాదవజగ్గరాజుపేట కాలనీల్లో వీధిదీపాలు వెలగడం లేదు. రెండున్నరేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొనడంపై స్థానికులు తీవ్ర ఆ గ్రహం వ్యక్తంచేస్తున్నారు. వీధి దీపాలు వెలగడం, ఆరిపోవడం మినహా పూర్తిస్థాయిలో పనిచేయడంలేదని వాపోతున్నారు. సాయంత్రమైతే చీకట్లు అలముకుంటున్నాయి. పాదచారులు, ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. యాదవజగ్గరాజుపేట, మాతృశ్రీనగర్, ఫకీరుతఖ్యా, ఉడానగర్ సమీపంలోని మలుపు మార్గాల్లో భయానక వాతావరణం నెలకొంటోంది. చీకట్లో నిర్మానుష్య రహదారులపై ప్రయాణించడానికి మహిళలు, చిన్నారులు భీతిల్లుతున్నారు. ఇదే అదనుగా ఆకతాయిలు, చిల్లర దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. చీకట్లో కార్లు, ఇతర వాహనాలు దూసుకువస్తుండడంతో పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. నాసిరకం బల్బులతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గాజువాక నియోజకవర్గం 20 వార్డులలో 22 వేల విద్యుత్ వీధి దీపాలున్నాయి. ఇందులో సుమారు 18 వేలు మాత్రమే వెలుగుతుండగా, 4వేలకు పైగా మరమ్మతులకు గురయ్యాయి. ఈ జోన్ పరిధిలో గత కొద్ది నెలల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదంటూ అధికారులకు వందలాదిగా ఫిర్యాదులు అందాయి. వీటిలో 70 శాతం వరకు పరిష్కరించామని అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. సిబ్బంది కొరత కారణంగా సమస్యను తక్షణం పరిష్కరించలేకపోతున్నామని, స్పెషల్ డ్రైవ్ చేపట్టి దీపాలకు మరమ్మతులు చేపడతామని చెబుతున్నారు.

పర్యవేక్షణలో నిర్లక్ష్యం

విద్యుత్ దీపాల నిరంతర పర్యవేక్షణలో జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తోంది. వేసిన దీపాలను ఆపకుండా వదిలేస్తుండడంతో పాటు కొత్తవి అమర్చకుండా పలు కాలనీల ప్రజలను అంధకారంలోకి నెట్టేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దిగువ స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా పనిచేస్తుండడంతోనే సమస్య ఎదురవుతోందని, అధికారుల ఆదేశాలను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి



రెండేళ్లుగా వీధి దీపాలు వెలగకపోవడంతో పలు ప్రాంతాలలో ప్రమాదాలు సంభవించాయి. కొందరు మృత్యువాత పడారు. మరికొందరు గాయాలపాలయ్యారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో వేలాది లైట్లు వెలగడం లేదు. దీనిపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ, స్పందన కనిపించడం లేదు. చీకట్లో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నారు. దీంతో పలువురు గాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, విద్యుత్ వెలుగులు ప్రసరించేలా చర్యలు తీసుకోవాలి.

-ఎన్.సూర్యనారాయణ, మాతృశ్రీనగర్

'వేతనాలు చెల్లించని సంస్థపై చర్యలు తీసుకోవాలి'



హెచ్‌పీసీఎల్ గేటు వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మల్కాపురం, ఆగస్టు 19: హెచ్‌పీసీఎల్ జయలక్ష్మి ఇంజనీరింగ్ సంస్థ కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ రామకృష్ణపురం రిఫైనరీ గేటు వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిటూ మల్కాపురం జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ జయలక్ష్మి ఇంజనీరింగ్‌లో పనిచేస్తున్న 36 మంది కార్మికులకు నాలుగునెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. బ్రిడ్జి అండ్ రూఫ్ వద్ద సబ్‌కాంట్రాక్ట్ ముఖేశ్ ఇంజనీరింగ్ సంస్థలోని కార్మికులకు ఫైనల్ సెటిల్‌మెంట్ చేయక కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై హెచ్‌పీసీఎల్ హెచ్‌ఆర్‌కు నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. హెచ్‌పీసీఎల్ యజమాన్యం ఈ విషయంలో స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం.కృష్ణారావు, జోన్ అధ్యక్షుడు కె.పెంటారావు, కార్మికులు పాల్గొన్నారు.

'ఉక్కు పోరాటాన్ని ఉధృతం చేయాలి'



రిలే నిరాహార దీక్షలో ప్రసంగిస్తున్న రామస్వామి

కూర్మన్నపాలెం, ఆగస్టు 19: ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాటాలను ఉధృతం చేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు యు.రామస్వామి పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న స్టీలు సీఐటీయూ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఉక్కు యాజమాన్యం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చైతన్యం పెంపొందించాలన్నారు. ఈ నెల 22న ప్రధాన పరిపాలనా భవనం వద్ద జరగనున్న ముట్టడిలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరో నాయకుడు ఎస్.రామారావు మాట్లాడుతూ ప్లాంట్‌లో సాధారణ ఉత్పత్తికి ముడిసరకు కొరత ఉందన్నారు. ప్రైవేటీకరణ సమస్యను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఏడు నెలలుగా ఉద్యోగులకు సకాలంలో జీతాలివ్వలేని స్థితికి చేరుకోవడం విచారకరన్నారు. విల్లా రామ్మోహన్ కుమార్, గంగాధర్, డీసీహెచ్ వేంకటేశ్వరరావు, వరసాల శ్రీనివాసరావు, ఎ.మసేనురావు, కాండ్రేకుల శ్రీనివాసులునాయుడు, తాండ్ర కనకరాజు, డి.నరసింగరావు, గుమ్మడి నరేంద్ర, గంగవరం గోపి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా శ్రావణ పౌర్ణమి పూజలు



వెంకన్నకు తిరువీధి నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు





డ్రైవర్సుకాలనీలో శాకంబరిగా కనకదుర్గమ్మ, రమా సహిత సత్యనారాయణ స్వామి కల్యాణంలో భక్తులు

ఆటోనగర్, ఆగస్టు 19: శ్రావణ మాసోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. డ్రైవర్సు కాలనీ, ఎల్‌వీనగర్‌లో కనకదుర్గను శాకంబరిగా అలంకరించి పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.మాతృశ్రీనగర్ విశ్వేశ్వర ఆలయంలో అభిషేకాలు జరిగాయి. మీసాల స్వామిగా అలంకరించారు. గ్రీన్‌సిటీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణ పుష్పాలతో అభిషేకాలు, సహస్రనామ పూజలు చేశారు.

శ్రీనగర్: శ్రీనగర్ శ్రీకృష్ణ గోవర్దన గిరి టెంపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది.

పెదగంట్యాడ: వెంకటాద్రిపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి సోమవారం మహాభిషేకం నిర్వహించారు. శ్రీవారి జన్మనక్షతం (శ్రవణం) సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేసి స్వామిని ఊరేగించారు. ధర్మకర్త మంత్రి మంజుల, చైర్మన్ దొడ్డి రమణ, సంతోషి, సత్యనారాయణ, అప్పలరెడ్డి, వేణుగోపాలరావు, శ్రీనివాసరావు, సత్యవతి పాల్గొన్నారు.

పెందుర్తి: స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి పూజలు, శ్రీనివాస, సుదర్శన హోమం నిర్వహించారు. నిత్య కల్యాణాన్ని జరిపారు.

వేపగుంట: శేషాద్రి కొండపై కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్ర పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, అర్చనలు చేశారు. ఆదినారాయణరావు, వర్మ, కృష్ణమూర్తి, సన్యాసిరావు, రాజేంద్ర, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తులతో నిరసన

వేపగుంట ఆగస్టు 19: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని పై జరిగిన అమానుష సంఘటనను నిరసిస్తూ వేపగుంట కూడలిలో సోమవారం రాత్రి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. కాలనీవాసులు, నాయకులు ప్లకార్డులు పట్టుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు, దారుణ ఘటనకు బాధ్యులైనవారిని కఠినంగా శిక్షించాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, జనసేన నేత పిన్నింటి పార్వతి, బీజేపీ నేతలు రామకృష్ణ, జుత్తాడ, మామిడి కిరణ్, టి.శ్రీను, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో...

గాజువాక: వైద్య విద్యార్థి హత్యతో సమాజం తలదించుకునే పరిస్థితి వచ్చిందని జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అమానుష ఘటనను నిరసిస్తూ గాజువాకలో సోమవారం జనసేన ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, నివాళులర్పించారు. దేశంలో మరే ఆడబిడ్డకు అన్యాయం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో



వేపగుంట కూడలిలో కూటమి నేతల ర్యాలీ

గడసాల అప్పారావు, రమణారెడ్డి, మురళీదేవి, కనకారావు, గంధం వెంకటరావు, ప్రియదర్శిని పాల్గొన్నారు.

పెందుర్తిలో...

పెందుర్తి: కోల్‌కతా ఘటనకు నిరసనగా జనసేన వీర మహిళలు సుజాతనగర్‌లో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. వరూధిని, సుజాత ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. వైద్యులకు రక్షణ కల్పించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. రాపర్తి కిశోర్ పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో

జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌లో సంతాప సభ నిర్వహించారు. వేదిక కో శాధికారి ఎస్వీ రమణ, ప్రిన్స్‌పాల్ చంద్రశేఖర్, నాగమణి, సౌజన్య మంజుల తదితరులు వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనను ఖండించారు.

కూర్మన్నపాలెంలో...

కూర్మన్నపాలెం: కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెంలో బొండా చారిటబుల్ ట్రస్ట్, జీఎస్ఎల్ వీకర్సు ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. బీజేపీ నేత బొండా శ్రీదేవి మాట్లాడుతూ వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి జరిగితే ప్రభుత్వాలు స్పందించక పోవడం దారుణమన్నారు. మమతబెనర్జీ ప్రభుత్వంలో మహిళలకు, హిందువులకు రక్షణ కరవైందన్నారు. కార్యక్రమంలో రోహిణి, నాయుడు, రమణారావు, బలిరెడ్డి సత్యనారాయణ, కర్రి దినేష్, రమాదేవి,జయలక్ష్మి, ఇందిర, కరణం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో కొవ్వొత్తుల ర్యాలీ



పెందుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న వీర మహిళలు



కూర్మన్నపాలెంలో ప్లకార్డులతో నిరసన

పల్లాకు ఉక్కు యువ ఉద్యోగుల అభినందనలు



పల్లాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉక్కు యువ ఉద్యోగులు

గాజువాక, ఆగస్టు 19: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గర్భాం మైన్స్ లీజును పొడిగించేందుకు కృషి చేసిన గాజువాక ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఉక్కు యువ ఉద్యోగులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు.గాజు వాక పార్టీ కార్యాలయంలో కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత సమస్యలను వివరించారు. ప్లాంట్‌కు ముడి సరకు పూర్తిస్థాయిలో అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నమ్మి సింహాద్రి, అప్పలరాజు, కనకరెడ్డి, శివ, జగదీశ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా రక్షా బంధన్



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు రాఖీ కడుతున్న భీమిలి అనాథాశ్రమం చిన్నారులు

ఎమ్మెల్యే గణబాబుకు రాఖీ కట్టిన తెలుగు మహిళలు



పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు రాఖీ కడుతున్న తెలుగు మహిళలు

గోపాలపట్నం, ఆగస్టు 19: రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయకుల ఇళ్లకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబుకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగు మహిళలు రాఖీలుకట్టి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు మర్రిపాలెం ఉడాకాలనీలోని ఓం శాంతి బ్రహ్మకుమారీలు సోమవారం రక్షా బంధన్ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఇంటికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సోదరీమణుల ఆప్యాయత వెలకట్టలేదని కొనియాడారు. ఓం శాంతి సంస్థ చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రాజయోగ మెడిటేషన్ సెంటర్ బ్రహ్మకుమారీలు విమల, శాంతి, వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎం.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

షిప్‌యార్డులో...



షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు), షిప్‌యార్డు సీఎండీ హేమంత్ ఖత్రీ, మల్కాపుర సీఐ విద్యసాగర్, సిబ్బందికి బ్రహ్మకుమారాలు రామేశ్వరి, బీకే జ్యోతి రాఖీలు కట్టారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అగనంపూడి, ఆగస్టు 19: సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా పై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జీవీఎంసీ సీఎంహెచ్‌వో నరేశ్‌కుమా ర్ సూచించారు. పాతఅగనంపూడి కోనేరులో దోమల నిర్మూలనలో భాగంగా సోమవారం యాంటీ లార్వా డ్రోన్ స్ప్రెయింగ్ పిచికారీ కార్యక్రమాన్ని ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమల నియంత్రణకు జీవీఎంసీ ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. డ్రోన్‌ల సాయంతో పెద్దపెద్ద చెరువుల్లో యాంటీ లార్వా డ్రోన్ స్ప్రెయింగ్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలు జర్వం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈకార్యక్రమంలో 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు,ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, స్థానిక నాయకులు కరణం జగదీశ్, మాడిశ వెంకటరావు, సింగిడి సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



వృద్ధాశ్రమంలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

పెందుర్తి, ఆగస్టు 19: పెందుర్తి ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్స వం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శరగడం రాము ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమా ల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక లయోలో వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేసి వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తోటకూర లక్ష్మణరావు, ఎస్ఆర్‌సీ మోహన్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుసులవాడలో క్వారీ లీజులపై వివాదం

- 28న ప్రజాభిప్రాయసేకరణకు గ్రామస్థుల అభ్యంతరం



గ్రావెల్/ క్వార్ట్జ్ క్వారీ తవ్వకాలు చేపట్టనున్న కొండ

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం కుసులవాడ గ్రావెల్, క్వార్ట్జ్ క్వారీ లీజుపై వివాదం ముదిరింది. గ్రామానికి అతి సమీపంలో క్వారీలకు అనుమతించేదిలేదని గ్రామస్థులు తేల్చి చెబుతుండడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. కుసులవాడసర్వేనంబరు 104లో 7.99 హెక్టార్లలో గ్రావెల్, క్వార్ట్జ్ తవ్వకాలకు ఈనెల 28న ప్రజాభిప్రాయసేకరణ చేపట్టనున్నారు. గ్రామానికి ఆనుకుని కాలనీలు ఉన్నాయి. అయినా గతంలో వైసీపీ నేతల ద్వారా పైరవీ చేసుకుని కొందరు క్వారీ తవ్వకాలకు ఒత్తిడి తెచ్చారు. గనుల శాఖ నిర్వహించిన వేలంలో లీజులు దక్కించుకున్న వ్యక్తి ప్రజాభిప్రాయసేకరణ చేపట్టి తరువాత కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతి తీసుకోవాలి. అయితే క్వారీ లీజులు, ప్రజాభిప్రాయసేకరణకు ముందుగా తహసీల్దారు అనుమతి ఉండాలి. గతంలో తర్లువాడలో ఒక క్వారీ విషయంలో ప్రజాభిప్రాయసేకరణలో ప్రజలు తిరగబడ్డారు. దీంతో గత కలెక్టర్ క్వారీలకు నిరభ్యంతర పత్రం ఇచ్చేముందు తనకు చెప్పాలని తహసీల్దార్లకు ఆదేశించారు. అయినా ఆనందపురం తహసీల్దార్లు నిరభ్యంతర పత్రాలు జారీచేయడంతో గనుల శాఖ లీజులు మంజూరీచేసింది. క్వారీ తవ్వకాలకు అనుమతుల కోసం కాలుష్యనియంత్రణమండలి 28న కుసులవాడలో ప్రజాభిప్రాయసేకరణ చేపడతామన ప్రకటించడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కుసులవాడకు ఆనుకుని జగన్నాథపురం సర్వేనంబరు 1లో 9.90 హెక్టార్లల్లో రాయి, గ్రావెల్ తవ్వకాలకు గనుల శాఖ అనుమతి ఇచ్చింది. కలెక్టర్‌కు చెప్పకుండా తహసీల్దారు దీనికి ఎన్‌వోసీ ఇచ్చేశారు. జగన్నాథపురంలో గ్రేహౌండ్స్‌కు సుమారు 200మీటర్ల దూరంలో సర్వేనంబరు -1లో 9.90 హెక్టార్ల విస్తీర్ణంలో క్వారీని గుర్తించారు. దీనికి కూడా తహసీల్దారు మాత్రం ఎన్‌వోసీ ఇవ్వడం గమనార్హం.

ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం



విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్

రామ్‌నగర్, ఆ గస్టు 19: బీచ్ రోడ్డులోని విశాఖ మ్యూజియంలో వైజాగ్ ఫొటో జర్న లిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినో త్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏ ర్పాటు చేసిన ఫొటో ఎగ్జి బిషన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబి షన్ రెండు రోజులపాటు జరుగుతుందన్నారు. ప్రదర్శనలో 300లకు పైగా ఫొటోల ను ఉంచారని, నగరవాసులు వాటిని తిలకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్ మూర్తి, కార్యదర్శి జి. తిరుపతిరావుపాల్గొన్నారు.

ముగిసిన చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ



విజేతలతో అతిథులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 19: ఆల్ విశాఖ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడలిస్టు చెస్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ముగిసింది. ఎంవీపీ కాలనీ వద్దనున్న ఎస్-3 స్పోర్ట్సు ఎరీనాలో జరిగిన ఈ టోర్నీలో నగర పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది చిన్నారులు పాల్గొన్నారు. బాల, బాలికల విభాగాల్లో తొలి ఐదు స్థానాలలో విజేత లుగా నిలిచిన చిన్నారులను జోనల్ స్థాయి టోర్నీకి ఎంపిక చేసినట్టు ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్షుడు బాబూరావు తెలిపారు. ఈ టోర్నీలో ఎస్-3 స్పోర్ట్సు ఎరీనా డైరెక్టర్ సహాని ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు. చెస్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో బుల్లయ్య క్రీడాకారులకు పతకాలు



క్రీడాకారులను అభినందిస్తున్న మధుకుమార్, కోచ్‌లు

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 19: జిల్లా జూనియర్, సీనియర్ పురు షులు, మహిళల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో బుల్లయ్య కాలేజీ విద్యార్థులు పతకాలు సాధించారు. నగరంలో జరిగిన ఈ టోర్నీ మహిళల విభాగంలో ఎస్. హేమ, బి. తేజశ్రీ స్వర్ణ పతకాలు, జి. పూజిత, కె. భాగ్యశ్రీ రజత పతకాలు, కె. జ్ఞాపికరెడ్డి, జి.అనూష కాంస్య పతకాలు సాధించారు. కాగా, పురు షుల విభాగంలో బి. రామ్‌చరణ్ తేజ, ఎస్. శ్యామ్‌కుమార్, సీహెచ్. లోకేశ్ స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా, ఏఎంబీఎస్ఎస్ గణేష్, పి. భార్గవ్, బీపీఎంకే యాద వ్ రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవరం కాలేజీ కరస్పాం డెంట్ డాక్టర్ జి. మధుకుమార్ తన కార్యాలయంలో ఈ విద్యార్థులను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ వై. శ్రీ నివాసరావు, డాక్టర్ బీఆర్ఎస్. లక్ష్మణరెడ్డి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు అభినందనలు

మురళీనగర్, ఆగస్టు 19 ; ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు సోమవారం టీడీపీ 50వవార్డు అధ్యక్షుడు సనపల.వరప్రసాద్, నాయకులు కె.వెంకటేష్ తదితరులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యేని కలసి పుష్పగుచ్చాలు, శాలువతో సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించి ప్రజలకు చేరువలో ఉండాలని ఆకాంక్షించారు. ఏసీఏ తరఫున పలుటోర్నమెంట్స్ నిర్వహణతో క్రీడాకారులకు చేయూతనివ్వాలని ఈ సందర్భంగా వరప్రసాద్ కోరారు.



విష్ణుకుమార్‌రాజుకు పుష్పగుచ్ఛమిస్తున్న టీడీపీ నాయకులు

వెలగని ఇండికేషన్ లైట్స్‌తో ట్రాఫిక్ కష్టాలు

- డాబాగార్డెన్స్ సర్కిల్ వద్ద సమస్య
- ఇష్టానుసారంగా రాకపోకలు
- ప్రమాదాల బారిన వాహనదారులు



అంబేడ్కర్ జంక్షన్‌లో పనిచేయని ట్రాఫిక్ ఇండిగేషన్ లైట్స్



ఎల్ఐసీ కూడలివైపు వెళ్లే మార్గంలో..

డాబాగార్డెన్స్, ఆగస్టు 19: డాబాగార్డెన్స్ అంబేడ్కర్ సర్కిల్ నగరంలో ప్రధాన జంక్షన్. నిత్యం వేలాది వాహనాలు నలువైపులనుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. వివిధ వాణిజ్య సముదాయాలు, ఆర్టీసీ కాంప్లెక్స్, కాలేజీలు, కార్యాలయాలుఉండడంతోపాటు వన్‌టౌన్‌రోడ్డుకు ఈ మార్గాన్నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో ఎప్పుడూ ఈ జంక్షన్ రద్దీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ఇండికేషన్ లైట్స్ ఎంతో కీలకం. కానీ, కొన్నిరోజులుగా ఇవి పనిచేయకపోవడంతో సర్కిల్ వద్ద రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టూ తిరిగే సమయంలో ఒక్కోసారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్న సంఘటనలున్నాయి. రాత్రి వేళలో ఈసమస్య మరింత జటిలంగా మారుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు ఇండికేషన్ లైట్స్ పనిచేసేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

మహిళా న్యాయవాదుల అభ్యున్నతికి కృషి



సంఘీభావం తెలుపుతున్న మహిళా న్యాయవాదులు

సీతంపేట, ఆగస్టు 19: మహిళా న్యాయవాదుల అభ్యున్నతికి, సమాజంలో అసమానతలను, వివక్ష రూపుమాపేందుకు కృషి చేస్తామని వుమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు అనురాధ పప్పు, కార్యదర్శి పి.హేమమాలిని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహిళా న్యాయవాదుల ఔన్నత్యాన్ని పెంపొందించేలా వారికి సహాయ సహకారాలందించాలనే ఉద్దేశంతో వుమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించినట్టు చెప్పారు. మహిళా న్యాయవాదులు పనిచేస్తున్న ప్రదేశం వద్ద భద్రత, వ్యక్తిత్వ వికాసం కోసం పనిచేస్తామన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మహిళా హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కోల్‌కత్తాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యాచారాన్ని ఖండిస్తూ మంగళవారం ఉదయం కోర్టు వద్ద నుంచి ర్యాలీని నిర్వహిస్తామన్నారు. ఈ నెల 31న సిరిపురంలోని వీఆర్ ఎండీ చిల్డ్రన్ ఎరినా హాలులో మహిళా న్యాయవాదులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో హైకోర్టు, జిల్లా కోర్టు జడ్జిలు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మి నాగశ్రీ దుర్గా, కోశాధికారి పి.రమాదేవి, జాయింట్ సెక్రటరీ పి.లీలావతి, కె.ఎస్. కళావతి, ఎస్.హేమలత, డి.కనకదుర్గా, డి.సుకన్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత నడవడికపై పర్యవేక్షణ తప్పనిసరి

- ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి



మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి

డాబాగార్డెన్స్, ఆగస్టు 19: యువత నడవడికపై నిరంతరం తల్లిదండ్రులు పర్యవేక్షించాల్సిన అవసరం కచ్చితంగా ఉందని ఏసీపి అన్నెపు నర్సింహమూర్తి సూచించారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం 'మాదక ద్రవ్యాల వినియోగ విషసంస్కృతి- ప్రమాదంలో యువత భవిష్యత్తు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాలు తీసుకోవడం ద్వారా మెదడుపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. దీంతో యువత చెడుమార్గంలో మరలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ దుష్ఫలితాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. డాక్టర్ ఎన్.ఎన్.రాజు, డా.వి.ఎస్. కృష్ణ కాలేజీ ప్రిన్సిపాల్ ఐ. విజయబాబు మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధంపై తగు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. ప్రజలు ఇందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊర్వశి జంక్షన్‌లో గంటన్నరపాటు నిలిచిన ట్రాఫిక్

- సమస్య పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు



ఊర్వశి జంక్షన్ వద్ద నిలిచిన వాహనాలు

కంచరపాలెం, ఆగస్టు 19 : కంచరపాలెం మెట్టు నుంచి ఊర్వశి జంక్షన్ వరకు సోమవారం రాత్రి ట్రాఫిక్ గంటన్నరపాటు నిలిచిపోయింది. ఈ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జంక్షన్‌లో చిన్నగా ఉన్న రోడ్డు దీనితో పాటు మధ్యలో ఎక్కడిపడితే అక్కడ డివైడర్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. మెట్టు, ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నా వాటిని పర్యవేక్షించడానికి సిబ్బందిని సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో సమస్య యథాతథమవుతోంది. సోమవారం రాత్రి గంటల తరబడి రోడ్డు మధ్యలో వాహనాలు చిక్కుకుపోయి ఎటూ వెళ్లలేని స్థితిలో ఉండిపోవడంతో వాహనదారులు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సమస్యపై మాత్రం ట్రాఫిక్ పోలీసులు పట్టనట్టు వ్యవహరించడంపట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఈ మార్గంలో ప్రత్యేక ట్రాఫిక్ బీట్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

సముద్ర తీర ప్రాంతం కబ్జా

కలెక్టర్‌కు జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఫిర్యాదు

మహారాణిపేట, ఆగస్టు 19: కోస్తా జిల్లాల పరిధిలోని సముద్ర తీర ప్రాంతంలో పెద్దఎత్తున సీఆర్‌జెడ్ నిబంధనలుఉల్లంఘించి 73 కిలోమీటర్ల మేర ఆక్రమించారని, వీటిని తొలగించాలని జనసేన కార్పొరేటర్ పి. మూర్తియాదవ్ కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల వేదికలో ఆయన వినతి పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమిలి బీచ్ రోడ్డులో పెద్దఎత్తున సీఆర్‌జెడ్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని, కొందరు అధికారులే కబ్జాలకు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇసుక తిన్నెల్లో కట్టడాలను యథేచ్ఛగా సాగిస్తున్నారన్నారు. సాగర తీరాన్ని ఆక్ర మణలనుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మత్స్యకారులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలన్నారు.

రాఖీ వేడుకలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

రామ్‌నగర్, ఆగస్టు 19: విశాఖ పర్యటనలో ఉన్న సుప్రీం కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి సోమవారం కుటుంబ సభ్యులతో కలసి రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భీమిలిలోని హోటల్ నోవాటెల్ లోసందడిగా గడిపారు. తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.



న్యాయమూర్తి జస్టిస్ మహేశ్వరికి రాఖీ కడుతున్న దృశ్యం

ఇలా జరుగుతుందని ఊహించలేదు...

... 5వ పేజీ తరువాయి

చేర్పించామన్నారు. అక్కడ బాగా చదువుకుంటుందని ఆశ పడ్డామన్నారు. ఆశ్రమ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ దారుణం సంభవించిందన్నారు. పిల్లలకు వాంతులు, విరేచనాలు అయితే ఆస్పత్రికి తీసుకువెళ్లకుండా..తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి పంపించేశారన్నారు. మరో చిన్నారి గీత తండ్రి బాబూరావు మాట్లాడుతూ శనివారం రాత్రి నుంచే పాపకు వాంతులు అవుతున్నాయని, కానీ, తీరిగ్గా ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం ఫోన్ చేశారన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్లే పాపను ఆశ్రమంలో చేర్పించామని, ఇలా జరుగుతుందని ఎప్పుడూ అనుకోలేదని వాపోయారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనే

... 5వ పేజీ తరువాయి

బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు చెందిన అంతర్రాష్ట్ర ముఠాలు పాల్పడుతుంటాయని పోలీసులు చెబుతున్నారు. ఎంతోకాలంగా ఆగిపోయిన చోరీలు తిరిగి మొదలుకావడంతో పోలీసులు సీరియస్‌గా దృష్టిసారించారు. చోరీలకు పాల్పడిన నిందితులు కారులో వచ్చినట్టు ఆచూకీ లభించడంతో ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. వీలైనంత త్వరగా నిందితులను పట్టుకోవడం ద్వారా ఏటీఎం చోరీలకు అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నారు.

సకాలంలో ధ్రువపత్రాలు జారీ

సీతమ్మధార, ఆగస్టు 19: విద్యార్థుల చదువుకు అవసరమైన కుల, నివాస, ఆదాయ తదితర ధ్రువపత్రాలను సకాలంలో జారీ చేసేలా చర్యలు చేపడుతున్నట్టు తహసీల్దార్ ఎం.రమేష్ పేర్కొన్నారు. సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో దరఖాస్తులను స్వీకరించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

సోదర భావం, ఆత్మీయ బంధాలకు రాఖీ పౌర్ణమి ప్రతీక

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ



గండిబాబ్జీకి రాఖీ కడుతున్న తెలుగు మహిళలు



ఆచార్య బాలమోహన్‌దాస్‌కి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

మహారాణిపేట, ఆగస్టు 19: సోదర భావం, ఆత్మీయ అనుబంధాలకు ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఆ పార్టీ సౌత్ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ అన్నారు. సోమవారం పార్టీ కార్యలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలను ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలుగు మహిళలు గండిబాబ్జీ, సీతంరాజు సుధాకర్‌కు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి భారతీయ సనాతన సంప్రదాయంగా వస్తోందన్నారు. సోదర సోదరీమణులకు అనుబంధాలకు ఈ వేడుకలు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు ఈతలపాక సుజాత, కేదారి లక్ష్మి, గనగళ్ళ సత్యవతి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్, ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. ముందుగా బ్రహ్మకుమారి సభ్యులు రమా, తదితరులు గాంధీ సెంటర్ అధ్యక్షులు ఆచార్య బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావు రాఖీలు కట్టి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధాలకు ఈ వేడుక నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, అహ్మద్ మున్నర్, చాట్ల బాబూరావు రెడ్డి, డాక్టర్ కేవీ ఎస్ఎన్ మూర్తి, హరగోపాల్, రచయిత్రి ఉండవల్లి సుజాతామూర్తి, సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాధవధార; గ్రేటర్ 50వ వార్డు మురళీనగర్ బ్రహ్మకుమారీ శాంతిధామంలో సోమవారం రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు, ప్రముఖులు, కార్పొరేటర్లకు శాంతిధామం ఇన్‌చార్జి బి. కె. అపరంజి అధ్వర్యంలో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఏటా ఈ సెంటర్‌లో సోదరభావాన్ని చాటుతూ రక్షాబంధన్ నిర్వహిస్తున్నట్టు బ్రహ్మకుమారీలు తెలిపారు.

అక్కయ్యపాలెం: ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు, వైజాగ్ కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్.శ్రీధర్‌కు బ్రహ్మకుమారి శశికళ రాఖీ కట్టారు.

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

... 5వ పేజీ తరువాయి

వెళ్లిన తరువాత విద్యార్థుల పరిస్థితి మరింత విషమించిందని చెబుతున్నారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు ఉండరని, ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే డబ్బులు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి వస్తుందని సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య చేయిద్దామని అనుకున్నామని చింతపల్లి మండలం పొలంబంద గ్రామానికి చెందిన మర్రి చందు తెలిపారు. హాస్టల్‌లో ఉంచితే చదువు బాగా చెబుతారని తెలిసినవారు చెబితే తన ఇద్దరు పిల్లలు ప్రశాంత్, రంజిత్‌లను చేర్పించామని చెప్పారు. సోమవారం తన ఇద్దరు పిల్లల పరిస్థితి బాగాలేకపోతే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చామని తెలిపారు.

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో..

అస్వస్థతకు గురైన 34 మంది విద్యార్థులు ప్రాంతీయ ఆస్పత్రి అత్యవసర విభాగంలో చికిత్స పొందారు. వీరిలో కొంత మందిని మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు, ప్రజా సంఘాల నాయకులతో ఏరియా ఆస్పత్రి నిండి పోయింది. సోమవారం మధ్యాహ్నానికి 16 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా, ఇక్కడ వైద్యులు హుటాహుటిన అత్యవసర వైద్య సేవలు అందించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కి తరలించారు. తరువాత కొయ్యూరు మండలం డౌనూరు నుంచి మరో 18 మంది విద్యార్థులను ఏరియా ఆస్పత్రికి తీసుకు రాగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కి తరలించారు. మిగిలిన వారికి ఏరియా ఆస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎస్పీ దీపిక, ఆర్డీవో జయరాం, డీసీహెచ్ఎస్ శ్రీనివాసరావు ఏరియా ఆస్పత్రిని సందర్శించి గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, వైద్యులను ఆరా తీశారు.

ఆస్పత్రిలో పరుగులు పెట్టిన డాక్టర్లు

ఏరియా ఆస్పత్రిలో తీవ్ర అస్వస్థతతో చేరిన చిన్నారుల ప్రాణాలు కాపాడే ప్రయత్నంలో వైద్యులు పరుగులు పెట్టారు. సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి, చిన్ని పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, మిగిలిన వైద్యులు, వైద్య సిబ్బంది వేగవంతమైన సేవలు అందించారు. ఉదయం నుంచి రాత్రి వరకు మొత్తం 34 మంది విద్యార్థులకు అత్యవసర వైద్య సేవలు అందించారు. వైద్య విధాన పరిషత్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు.. ఏరియా ఆస్పత్రి వైద్యులు అందించి వేగవంతమైన వైద్య సేవలను ప్రశంసించారు.

భూ కుంభకోణాలపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

భావిస్తున్నారు. అలాగే వృద్ధులకు ఆశ్రమం నిర్మిస్తామని చెప్పి ఎండాడలో హయగ్రీవ సంస్థ తీసుకున్న భూములను రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా పరిశీలించారు. ప్రాజెక్టులో పేర్కొన్న నిబంధనల మేరకు తొలుత వృద్ధాశ్రమం నిర్మించాలి. కానీ అక్కడ విల్లాలు నిర్మిస్తున్నారు. దీనికితోడు ఒరిజినల్ డెవలపర్ జగదీశ్వరుడికి బదులు ఆయన జీపీగా ఉన్న ఆడిటర్ జి.వెంకటేశ్వరరావు పనులు చేపడుతున్నారు. పనులు నిలిపివేయాలని జీవీఎంసీ ఇచ్చిన ఆదేశాలపై జీవీ కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. దీనిపై ఇంతవరకూ ప్రభుత్వం కౌంటర్ వేయలేదు. దీనిపై త్వరలో ప్రభుత్వం అఫిడవిట్ వేయాలని నిర్ణయించినట్టు సిసోడియా పేర్కొన్నారు. అదేవిధంగా రామానాయుడు స్టూడియోకు ఇచ్చిన భూమిలో అనుమతులు లేకుండా లేఅవుట్ అభివృద్ధి చేస్తున్న విషయం ఆ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఇంకా నగర శివారుల్లో మాజీ సైనికులు, స్వాతంత్య్ర సమరయోధులు, పొలిటికల్ సఫరర్లకు ప్రభుత్వం ఇచ్చిన భూములు చేతులు మారినట్టు ఫిర్యాదులు రావడంతో 2016 తరువాత వాటిని 22-ఎలో చేర్చారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్నత స్థాయి ఒత్తిళ్ల మేరకు అందులో కొన్నింటికి మినహాయింపు ఇచ్చారు. అదేవిధంగా శారదా పీఠానికి భీమిలి మండలం కొత్తవలసలో ఎకరా కేవలం రూ.లక్షకు కేటాయించారు. పీఠానికి ఇచ్చిన భూములు వెనక్కి తీసుకోవాలంటే ఏ విధంగా ముందుకెళ్లాలి? అన్నదానిపై ఆలోచన చేస్తున్నారు. ఇక, వైసీపీ నేతలు కొందరు నగరం, పరిసరాల్లో పలువురిని బెదిరించి కోట్ల రూపాయల విలువైన భూములను బలవంతంగా తీసుకున్నారు. ఈ విషయమై ఈపీడీసీఎల్ మాజీ ఉన్నతాధికారి సతీమణి స్వయంగా సిసోడియాకు ఫిర్యాదు చేశారు. అటువంటి వ్యవహారాల్లో ఎలా ముందుకువెళ్లాలి? అనేది ఆలోచన చేస్తున్నారు. ఫ్రీహోల్డ్ సర్టిఫికెట్ల జారీపై కూడా న్యాయ నిపుణులతో చర్చించి ముందుకువెళ్లాలని యోచిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో న్యాయ నిపుణులతో చర్చించిన మీదట వివాదాస్పదమైన భూములపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నది.

సదరం కట్టుదిట్టం

... 5వ పేజీ తరువాయి

పరిశీలించిన తరువాత అర్హత ప్రామాణికంగా పాయింట్లు కేటాయించాలని ఉన్నత స్థాయి నుంచి ఆదేశాలు అందాయి.

భారీగా దరఖాస్తుదారులు

సామాజిక పింఛన్ పొందేందుకు సదరం సర్టిఫికెట్ అవసరం కావడంతో భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆంధ్ర మెడికల్ కళాశాల పరిధిలోని కేజీహెచ్, ఈఎన్‌టీ, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, మానసిక ఆస్పత్రితోపాటు మరో 20కిపైగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో సదరం సర్టిఫికెట్లు జారీచేస్తున్నారు. ఆర్థో, న్యూరో సంబంధిత సమస్యలు కలిగినవారికి కేజీహెచ్‌లో, కంటి సంబంధిత సమస్యలు కలిగిన వారికి ప్రాంతీయ కంటి ఆస్పత్రిలో, మానసిక సమస్యలతో బాధపడే వారికి మానసిక ఆస్పత్రిలో, వినికిడి, మూగ సంబంధిత సమస్యలు కలిగిన వారికి ఈఎన్‌టీ ఆస్పత్రి కేటాయిస్తున్నారు. బోధనాస్పత్రుల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో, మిగిలిన ఆస్పత్రుల్లో ప్రతి బుధ, గురువారాల్లో సదరం స్లాట్ బుక్ చేసుకుని వచ్చిన వారికి మెడికల్ ఎగ్జామినేషన్ (బోర్డు అసెస్‌మెంట్) జరుగుతుంది. కేజీహెచ్‌కు ఆయా రోజుల్లో కనీసం 50 మంది, మిగిలిన బోధనాస్పత్రులకు 20 మందివరకు వస్తుంటారు. అలాగే, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు కనీసం పది మంది వస్తుంటారు. వీరిని ఆయా ఆస్పత్రుల్లోని వైద్యులు పరిశీలించి సదరం వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేస్తారు. అనంతరం కొద్దిరోజుల తరువాత వారి ఫోన్‌కు సమాచారం వస్తుంది. ఈ సమాచారాన్ని ఆధారంగా చేసుకుని స్థానిక సచివాలయంలో గానీ, మీ సేవా కేంద్రాల్లోగాని సదరం సర్టిఫికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే, వైద్యులను మేనేజ్ చేస్తామంటూ కొందరు దళారులు ఆశావహులు నుంచి భారీగా వసూలు చేస్తున్నారు.

ఎక్కువ చూపించేలా..

సాధారణంగా సదరం సర్టిఫికెట్లకు వచ్చే వారిలో శారీరక వైకల్యం, మూగ, చెవిటి, మానసిక, న్యూరో సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఉంటారు. కొందరు చిన్నపాటి ఇబ్బంది ఉన్నా సదరం సర్టిఫికెట్ వస్తే నెల నెలా ప్రభుత్వం నుంచి సాయం పొందవచ్చునన్న ఆశతో ఉంటారు. వీరి ఆశను ఆసరాగా చేసుకుని చాలామంది వసూళ్లకు పాల్పడుతున్నారు. కొన్నిచోట్ల వైద్యులే ఈ వ్యవహారంలో భాగస్వాములవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆశల దీపాలు ఆరిపోయాయి

... 5వ పేజీ తరువాయి

పాస్టర్ నిర్వహిస్తుండడంతో తమ పిల్లలకు ఏలోటూ ఉండదని ఆదివాసీలు భావించారు. అయితే పాస్టర్ నిర్లక్ష్యంగా ఓ వివాహ విందులో మిగిలిపోయిన బిర్యానీని రాత్రివేళ పిల్లలకు పెట్టడంతో పెనువిషాదం చోటుచేసుకుంది.

ఆస్పత్రిలో చేర్పించి ఉంటే ప్రాణహాని తప్పేది..

అస్వస్థతకు గురైన విద్యార్థులను పాస్టర్ వెంటనే సమీపంలోనున్న ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించేశారు. నిరక్షరాస్యులైన ఆదివాసీలు పిల్లలను ఆస్పత్రికి తీసుకొని వెళ్లకుండా ఇళ్లకు తీసుకువెళ్లిపోయారు. దాంతో పరిస్థితి విషమించింది.



అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 19 : వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాతారాధనల తరువాత ఉత్సవమూర్తిని ఉభయదేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాల పూజలు చేశారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ ప్రతి నామానికి తులసీ దళాలతో పూజ జరిపారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సంస్కృత భాషతో వ్యక్తిత్వ వికాసం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 19 : సంస్కృత భాషతో సమగ్ర వ్యక్తిత్వ వికాసం ఉంటుందని ఆచార్య సత్యవాడ సత్యనారాయణమూర్తి అన్నారు.ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం నిర్వహించిన సంస్కృత భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ విజ్ఞానం అంతా సంస్కృత భాషలో ఉందన్నారు. అనంతరం విద్యార్థులు సంస్కృత గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో జీవీపీ వైస్ ప్రెసిడెంట్ డి. దక్షిణామూర్తి, ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్. బోస్, సంస్కృత భాషా విభాగధిపతి డాక్టర్ వారణాసి వెంకటేశ్వరశర్మ, తెలుగు విభాగం నుంచి డాక్టర్ యూవీఎస్ఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా.. తొలగని ముసుగు



పీఎంపాలెం స్టేడియం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి తొలగించని ముసుగు

కొమ్మాది, ఆగస్టు 19 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా అమలు చేసిన ఎన్నికల కోడ్ ముగిసినా.. అధికారులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు తొలగించలేదు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో జోన్-2 పరిధిలోని పలు ప్రాంతాల్లో రాజకీయ నాయకులు, జాతీయ నాయకులు, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన శిలా ఫలకాలకు, ప్రారంభోత్సవ శిలా ఫలకాలకు అధికారులు ముసుగు వేశారు. కోడ్ ముగిసి మూడు రోజులు కావస్తున్నా.. ఇంతవరకు నాయకుల విగ్రహాలకు ముసుగు తొలగించలేదు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో తొలగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటాలను కూడా తిరిగి అమర్చలేదు. కోడ్ అమల్లోకి వచ్చినప్పుడు కాని ముగిసిన తరువాత కాని ముసుగులు వేయడంలోనూ తొలగించడంలోనూ జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

భగతవద్గీతపై ప్రచారం

పద్మనాభం, ఆగస్టు 19 : పద్మనాభంలో ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కృష్ణభగవానుడి అవతారం విశిష్టత, తత్వం గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. అలాగే ఈనెలలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకల కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు కృష్ణసూరప్పుడు, పైడన్న, భవానీ, శేఖర్, గణేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తంగలాన్ :** శారద, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి).
- **మిస్టర్ బచ్చన్ :** కామేశ్వరి, మెలోడి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), కన్య విశేష్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం).
- **డబుల్ ఇస్మార్ట్ :** జగదాంబ, సంగం, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని కాంప్లెక్స్, లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **ఆయ్ :** రమాదేవి, వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీనరసింహ (గోపాలపట్నం).
- **కమిటీ కుర్రోళ్ళు :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)
- **భారతీయుడు-2 :** శ్రీకాంతి

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 42, టమాటా 27, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 20, పచ్చిమిర్చి 60, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 36, క్యాబేజి 24, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 130, బరబటి 25, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 82, గోరుచిక్కుడు 38, దోసకాయ 20, వెల్లుల్లి (పెద్దవి) 230, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 62, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 48, కంద 58, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	98
ఫారం ధర	--	118
విత్ స్కిన్	--	206
స్కిన్‌లెస్	--	216

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



కూడలిలో గత వారం భారీ ఎత్తున నిలిచిపోయిన ట్రాఫిక్



మార్కెట్ వద్ద ఇష్టానుసారం పార్కింగ్

ఆనందపురం జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు

- పండుగల సమయంలో మరింత రద్దీ
- నిత్యం ప్రమాదాలతో బెంబేలెత్తుతున్న వాహనదారులు

ఆనందపురం, ఆగస్టు 19 : ఆనందపురం జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా పండుగల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుండడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఆ సమయంలో మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల వరకూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో పాటు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అనకాపల్లి - ఆనందపురం ఆరు లేన్ల రహదారి ఏర్పాటులో భాగంగా ఆనందపురం జంక్షన్‌లో బ్రిడ్జి ఏర్పాటు చేసి రింగ్ రోడ్డు నిర్మించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో రోడ్డు విస్తరణ వల్ల ప్రయాణం ఎంతో



రింగ్ రోడ్డులో బారులు తీరిన వాహనాలు

సౌలభ్యంగా ఉంటుందని వాహనదారులు సంబరపడ్డారు. కానీ రోజురోజుకి ట్రాఫిక్ సమస్య పెరుగుతుండడంతో ప్రయాణికులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు. హైవే మీదుగా విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే బస్సులు ఇతర వాహనాలను ఆనందపురం జంక్షన్‌లో ఉన్న రింగ్ రోడ్డు మీదుగా మళ్లించడం అదే సమయంలో పెందుర్తి నుంచి వచ్చిన వాహనాలు, పద్మనాభం, బిపి కళ్లాలు మీదుగా వస్తున్న వాహనాలను ఒకే రోడ్డులో కలవడం వల్ల తీవ్ర రద్దీ ఏర్పడుతుంది.దీనికితోడు హైవేను ఆనుకుని పూలు, కూరగాయల మార్కెట్ ఉండడంతో ఈ ప్రాంతం నిత్యం వాహనాలతో కిక్కిరిసి కనిపిస్తుంది. దీంతో రోడ్డు దాటాలంటే ప్రయాణికులకు పెద్ద తలనొప్పిగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇక్కడ అనేక మంది మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. నేషనల్ హైవే అధికారులు ఈ రోడ్డును విస్తరించడానికి స్థల సమీకరణ చేసి పక్కనున్న షాపులన్నీ తొలగించారు. రోడ్డును ఆనుకుని ఉన్న భూమిని హైవే అధికారులు తీసుకుని రైతులకు పరిహారం కూడా అందించారు. ఈ ప్రక్రియ 2001లో జరిగింది. అక్రమ నిర్మాణాలు తొలగించి రోడ్డు విస్తరణ చేపట్టినట్టుయితే వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఉండి ప్రమాదాలు జరగకుండా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుసులవాడలో క్వారీ లీజులపై వివాదం

విశాఖపట్నం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలం కుసులవాడ గ్రావెల్, క్వార్ట్ క్వారీ లీజుపై వివాదం ముదిరింది. గ్రామానికి అతి సమీపంలో క్వారీలకు అనుమతించేదిలేదని గ్రామస్థులు తేల్చి చెబుతుండడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. కుసులవాడసర్వేనంబరు 104లో 7.99 హెక్టార్లలో గ్రావెల్, క్వార్ట్ తవ్వకాలకు ఈనెల 28న ప్రజాభిప్రాయసేకరణ చేపట్టనున్నారు. గ్రామానికి ఆనుకుని కాలనీలు ఉన్నాయి. అయినా గతంలో వైసీపీ నేతల ద్వారా పైరవీ చేసుకుని కొందరు క్వారీ తవ్వకాలకు ఒత్తిడి తెచ్చారు. గనుల శాఖ నిర్వహించిన వేలంలో లీజులు దక్కించుకున్న వ్యక్తి ప్రజాభిప్రాయసేకరణ చేపట్టి తరువాత కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ అనుమతి తీసుకోవాలి. అయితే క్వారీ లీజులు, ప్రజాభిప్రాయసేకరణకు ముందుగా తహసీల్దారు అనుమతి ఉండాలి. గతంలో తర్లువాడలో ఒక క్వారీ విషయంలో ప్రజాభిప్రాయసేకరణలో ప్రజలు తిరగబడ్డారు. దీంతో గత కలెక్టర్ క్వారీలకు నిరభ్యంతర పత్రం ఇచ్చేముందు తనకు చెప్పాలని తహసీల్దార్లకు ఆదేశించారు. అయినా ఆనందపురం తహసీల్దార్లు నిరభ్యంతర పత్రాలు జారీ చేయడంతో గనుల శాఖ లీజులు మంజూరీచేసింది. క్వారీ తవ్వకాలకు అనుమతుల కోసం కాలుష్యనియంత్రణమండలి 28న కుసులవాడలో ప్రజాభిప్రాయసేకరణ చేపడతామని ప్రకటించడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కుసులవాడకు ఆనుకుని జగన్నాథపురం సర్వేనంబరు 1లో 9.90 హెక్టార్లల్లో రాయి, గ్రావెల్ తవ్వకాలకు గనుల శాఖ అనుమతి ఇచ్చింది. కలెక్టర్‌కు చెప్పకుండా తహసీల్దారు దీనికి ఎన్‌వోసీ ఇచ్చేశారు. జగన్నాథపురంలో గ్రేహౌండ్స్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో సర్వేనంబరు -1లో 9.90 హెక్టార్ల విస్తీర్ణంలో క్వారీని గుర్తించారు. దీనికి కూడా తహసీల్దారు మాత్రం ఎన్‌వోసీ ఇవ్వడం గమనార్హం.



గ్రావెల్, క్వారీ తవ్వకాలు చేపట్టనున్న కొండ



వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 77 వినతులు

వెంకోజీపాలెం, ఆగస్టు 19 : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నగర వ్యాప్తంగా 77 వినతులు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. మూడు రోజుల్లో ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సింహాచలం క్షేత్ర మహాత్మ్యం పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ శ్రీనివాసమూర్తి, తదితరులు

సింహాచలం, ఆగస్టు 19 : వరాహలక్ష్మీనృసింహస్వామి క్షేత్ర మహాత్మ్యం తెలుగు వారితో పాటు ఒడిశావాసులకు కూడా తెలిసే విధంగా ఒడిశా భాషలో ముద్రించిన 'సింహాచలం క్షేత్ర మహాత్మ్యం' పుస్తకాన్ని దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి సోమవారం కొండదిగువ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పన్నస్వామి భక్తుల్లో అధికులు ఒడిశావాసులు కావడంతో వారందరికీ క్షేత్ర విశేషాలు తెలిపేందుకు పుస్తకాన్ని ముద్రించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



జడ్సీ కనకమహాలక్ష్మికి వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నేత రవి

భీమునిపట్నం, ఆగస్టు 19 : చేపలుప్పాడ పరిసర గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు సూరాడ రవి కోరారు. సోమవారం ఆయన జోనల్ కార్యాలయంలో జడ్సీ కనకమహాలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం చేపలుప్పాడ పరిసర ఎనిమిది గ్రామాలకు తాగునీటి సదుపాయానికి కాపులుప్పాడలో బోరుబావితో పంప్‌హౌస్ నిర్మించారన్నారు. అక్కడి నుంచి అయిదు కిలోమీటర్ల దూరంలో చేపలుప్పాడలో వున్న గ్రౌండ్ లెవల్ సర్వీసు రిజర్వాయర్‌కు మంచినీరు పంపింగ్ అవుతుందన్నారు. పైపులైన్ తరచూ మరమ్మతుకు గురవుతుండడంతో వారంలో రెండు మూడు రోజులు తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తగరపువలస జనసేన నాయకురాలు పరిమి భువనేశ్వరి మాట్లాడుతూ శ్రీనగర్ హరిజనపేట వద్ద ఉన్న పబ్లిక్ మరుగుదొడ్ల నుంచి దుర్వాసన రావడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయని తెలిపారు. తక్షణమే వాటిని తొలగించి స్థలాన్ని వేరే అవసరాలకు వినియోగించాలని కోరారు. కాగా పీజీఆర్ఎస్‌లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మూడు వినతులు వచ్చాయని జడ్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సివిల్ వర్క్స్ ఏఈ సుమన్, వాటర్ సప్లై ఏఈ సురేష్, ఏపీడీ సంతోష్, ఆర్ఓ నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన పద్మనాభం ఎంపీడీఓ

పద్మనాభం, ఆగస్టు 19 : పద్మనాభం ఎంపీడీఓ ఎం. విజయకుమార్ సోమవారం విధుల్లో చేరారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈఏడాది ఫిబ్రవరిలో తూర్పుగోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లిన ఆయన పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నికల అనంతరం తన పాత స్థానమైన పద్మనాభం ఎంపీడీఓగా తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన బి. శైలజ శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు.

గురుకుల పాఠశాల స్కూల్ కమిటీ ఎన్నిక

కొమ్మాది, ఆగస్టు 19 : మధురవాడ రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాల మేనేజ్‌మెంట్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. ఎంఈఓ రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ టి. నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికలో చైర్మన్‌గా బగాది జగదీష్, వైస్ చైర్మన్‌గా పి. సరోజిని ఎన్నికయ్యారు.



పాంద్రంగిలో నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రం



మద్ది గ్రామంలో ఇసుక గెడ్డ వద్ద రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- వీధుల్లో పేరుకుపోతున్న చెత్త
- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
- దోమల వ్యాప్తితో వ్యాధుల బారిన ప్రజలు

పద్మనాభం, ఆగస్టు 19 : పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. నెలలు తరబడి పనులు చేపట్టకపోవడంతో వీధుల్లో చెత్త, ఇతర వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 45 ప్రకారం పంచాయతీలు తప్పనిసరిగా చేయాల్సిన విధుల్లో.. పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ప్రధాన బాధ్యతగా ఉంది. క్లాప్ మిత్రల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసే పద్ధతిని ప్రజలకు అలవాటు చేసి వాటిని సేకరించి దాన్ని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడానికి 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. దీనిలోభాగంగా ప్రతి పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్మించారు. ఈ కేంద్రాల్లో తడి చెత్తతో వానపాము ఎరువు తయారీతో పాటు, పొడి చెత్తను విభజించి విక్రయించడం ద్వారా ఆదాయం పొందాలని లక్ష్యంగా నిర్ణయించారు. చాలా పంచాయతీలు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి తడి చెత్తతో వానపాము ఎరువును తయారు చేసి విక్రయించడం ద్వారా, పొడి చెత్తను విభజించి అమ్మడంతో ఆదాయం పొందాయి. ప్రజలకు కూడా చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా క్లాప్ మిత్రలకు ఇచ్చే అలవాటైంది. 2019 వరకు కొన్ని కేంద్రాలు బాగానే నడిచినా అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని కొనసాగించడంలో నిర్లక్ష్యం వహించడంతో సంపద కేంద్రాలు మూలకు చేరాయి. మండలంలో 22 పంచాయతీలు ఉండగా 15 చోట్ల ఈ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీల్లో చెత్త సేకరించినా కేంద్రాలకు తీసుకురాకుండా ప్రధాన రహదారుల పక్కన కుప్పలుగా వేస్తున్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఆ చెత్తను కాల్చి వేసి పర్యావరణానికి విఘాతం కల్పిస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టిసారించి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

కన్నుల పండువగా కనకమ్మ అమ్మవారి తొలేళ్లు



వెంకోజీపాలెం, ఆగస్టు 19 : పాత వెంకోజీపాలెంలో వేంచేసి ఉన్న కనకమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. రాధాకృష్ణ యాదవ సేవా సంఘం, సీతారామ సేవా సంఘం, శెట్టి బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారికి ముందుగా పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించారు. సాయంత్రం హెచ్‌బీ కాలనీ హౌసింగ్ బోర్డు కార్యాలయం వద్ద ఉన్న అమ్మవారి శతకం పట్టు నుంచి పుట్ట మన్ను తీసుకువచ్చి సీతారామాలయం వరకు మూడుసార్లు ఊరేగించారు. మంగళవారం జరిగే జాతరలో పుట్ట మన్నును రామాలయం వద్ద నుంచి అమ్మవారి ఆలయానికి తీసుకువెళ్లనున్నారు.కార్యక్రమంలో పూజారులు ఒమ్మి కోటి, రవి, అప్పారావు, పల్లా రాంబాబు, రాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, ఉపాధ్యక్షుడు పల్లా పెంటారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి కోటిబాబు,కార్యదర్శి ఒమ్మి అప్పలరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి రాజు, సహాయ కార్యదర్శి జోగ రాంబాబు, కోశాధికారి ఒమ్మి శ్రీను, సహాయ కోశాధికారి జగ్గారావు, సీతారామ సేవా సంఘం అధ్యక్షుడు ఆడారి పరదేశి, శెట్టి బలిజ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పశుసంవర్థక శాఖ జేడీ రామకృష్ణ, తదితరులు

ఆరిలోవ, ఆగస్టు 19 : ప్రస్తుత సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకుండా మంగళవారం నుంచి టీకాలు వేయనున్నట్టు జిల్లా పశు సంవర్థక శాఖ జేడీ రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గి రైతులు నష్టాలకు గురవ్వాల్సి వస్తుందన్నారు. ఈమేరకు ఈనెల 20 నుంచి వచ్చేనెల 18 వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు చెప్పారు. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖాధికారులు డాక్టర్ చంద్రశేఖర్, కరుణాకర్, సజ్జ శ్రీనివాస్, మాదిన ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డులో మురుగు నీటి ఇబ్బందులు

తగరపువలస, ఆగస్టు 19 : తగరపువలస పరిధిలోని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో మురుగు నీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. సంగివలస, సబ్బవానిపేట ప్రాంతాలకు చెందిన మురుగు నీరంతా సర్వీసు రోడ్డులోకి వస్తోంది. వర్షం పడితే ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా మారుతోంది. సంగివలస చెరువులోకి ఈ నీటిని మళ్లిస్తే సమస్య ఉండదు. కానీ, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి గత ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పలుమార్లు హామీ ఇచ్చినా అమలు కాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించి, మురుగు నీరు చెరువులోకి వదిలే కాలువల వెడల్పు పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇంతవరకు ఆ పనులు ప్రారంభం కాలేదు. దీంతో వర్షం పడిన ప్రతిసారి సమస్య ఎదురవుతోంది. ఎగువ ప్రాంతాలకు చెందిన డ్రైనేజీల్లోని నీరంతా తగరపువలస సర్వీసు రోడ్డులో చేరుతోంది. అక్కడి నుంచి సమీపంలో ఉన్న చెరువులోకి వెళ్లేందుకు మార్గం లేకపోవడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ చెరువులో చేపల పెంపకం చేపడుతున్నారు. చేపలు చనిపోతాయని మురుగు నీటిని అందులో చేరేందుకు పెంపకందారులు అంగీకరించడం లేదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలంటే సబ్బవానిపేట ప్రాంతంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో కాలువలను నిర్మించడంతో పాటు దిగువకు వస్తున్న నీటిని మళ్లించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఆ దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకన్న ఆలయంలో శ్రవణ నక్షత్ర హవనం



అగ్నికుండంలో పూర్ణాహుతి చేస్తున్న వైదికులు

సింహాచలం, ఆగస్టు 19 : సింహగిరి కొండ దిగువ పూదోటలో కొలువుదీరి ఉన్న అలిమేల్‌మంగా, పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్ర హవనాన్ని సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతి నెల వెంకటేశ్వరస్వామి ఆవిర్భావ నక్షత్రాన్ని పురస్కరించుకుని సుదర్శన, నారసింహ హోమం నిర్వహించ డం ఆనవాయితీ. ఈమేరకు సుప్రభాతసేవ, ప్రభాతారాధనల తరువాత యజ్ఞ భగవానుడ్ని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం శాస్త్ర విధానంలో బింబారాధన, కలశారాధన, మండపారాధన చేసి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు జరిపారు. ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన జరిపి శాంతి హవనాన్ని జరిపారు.

ఘనంగా రక్షా బంధన్



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు రాఖీ కడుతున్న భీమిలి అనాథ ఆశ్రమ చిన్నారులు

వెంకోజీపాలెం, ఆగస్టు 19 : రాఖీ పూర్ణిమ పురస్కరించుకుని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి. శశిభూషణరావుకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు పలువురు ఏయూ అధికారులకు కూడా రాఖీ కట్టారు.

సింహాచలం : విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సింహాచలం దేవస్థానం సంస్కృత ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాను అన్నారు. రాఖీ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులతో విద్యార్థులకు రాఖీలు కట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సోదర సోదరీ భావనను పెంచాలన్న లక్ష్యంతో రాఖీ వేడుక నిర్వహించినట్టు చెప్పారు.

పద్మనాభం : పద్మనాభం కేజీబీవీలో రక్షా బంధన్ సందర్భంగా విద్యార్థినులు వృక్షా బంధన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, బాలికలు వృక్షాలకు రాఖీలు కట్టి చెట్లను కాపాడుకోవాలని ప్రతినబూనారు.

పల్లాకు ఉక్కు యువ ఉద్యోగుల అభినందనలు



పల్లా శ్రీనివాసరావుకు అభినందనలు తెలుపుతున్న ఉక్కు యువ కార్మికులు

గాజువాక, ఆగస్టు 19: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గర్భాం మైన్స్ లీజును పొడిగించేందుకు కృషి చేసిన గాజువాక ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఉక్కు యువ ఉద్యోగులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు.గాజువాక పార్టీ కార్యాలయంలో కలిసి స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత సమస్యలను వివరించారు. ప్లాంట్‌కు ముడి సరకు పూర్తిస్థాయిలో అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నమ్మి సింహాద్రి, అప్పలరాజు, కనకరెడ్డి, శివ, జగదీశ్ పాల్గొన్నారు.